
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు

జిల్లా వార్తలు 5

గురువారం 7 ఆగస్టు 2025

మత్స్యశాఖలో ఉపాధి అవకాశం

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కనీసం 7వ తరగతి ఉత్తీర్ణులైన నిరుద్యోగులకు మత్స్యశాఖలో ఉపాధి అవకాశం కల్పిస్తున్నట్లు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వీవీఆర్ నాయుడు తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలోని తమ కార్యాలయ ప్రాంగణంలో దేశీయ మత్స్య శిక్షణ కేంద్రంలో మూడు నెలల శిక్షణ ఉంటుందన్నారు. సెప్టెంబరు 1వ తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకుచేపల వేటలో అవసరమైన మెలకువలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంపై శిక్షణ ఇస్తామన్నారు.

ఇంటర్ విద్యార్థులకు క్విజ్ పోటీలు



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఇన్‌చార్జి ఆర్ఐవో షేక్షావలి

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ టౌన్ మోడల్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, హెచ్ఐవీపై యూత్ ఫెస్ట్-2025 కార్యక్రమంలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులతో కూడిన 11 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఇన్‌చార్జి ఆర్ఐవో షేక్షావలి, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డా.భాస్కర్ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ ఆలీ హైదర్, గణాంక అధికారి దేవి శంకర్‌గౌడ, ఐసీటీసీ కౌన్సిలర్లు గౌస్‌బాషా, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. క్విజ్‌పోటీల్లో ప్రథమ స్థానంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎస్.ఆయేషా సిద్ధిఖా, యూ.వైష్ణవి, సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల చెందిన జయశ్రీ, అక్షయ, నారాయణ కళాశాల విద్యార్థులు ఎస్ఎండీ సాదిక్, అబ్రజ, శ్రీవర్ధన్‌రెడ్డి వరుస మూడు స్థానంలో ఎంపికయ్యారు.



ప్లాట్లు.. పాట్లు

ప్రతి ఒక్కరికీ ఓ సొంతిల్లు ఉండాలన్నది కల.. ఆ కలను నెరవేర్చుకునేందుకు సగటు మనిషి జీవితాంతం పోరాడుతాడు.. రూపాయి.. రూపాయి కూడబెట్టి ఇంటిని నిర్మించుకునేందుకు సిద్ధపడుతున్నాడు. ఇల్లు కట్టుకోవాలంటే ముందుగా ప్లాటు కావాలి.. దాని కోసం నగర శివారుల్లో వెలుస్తున్న వెంచర్లపై దృష్టి పెడుతున్నాడు.. ఆకర్షణీయమైన బ్రోచర్లు... అదరగొట్టే ప్రకటనలు చూసి స్థలం చూడకుండా ముందడుగు వేస్తాడు.. అనుమతులు ఉన్నాయా.. లేదా అని కూడా ఆలోచించకుండా ప్లాటు కొనుగోలు చేస్తాడు.. అంతా అయ్యాక అక్రమ లేఅవుట్లు అని తెలిసి లబోదిబోమంటున్న బాధితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలంటూ కలెక్టర్‌కు అర్జీలు సమర్పిస్తున్నారు.

- విచ్చలవిడిగా వెలుస్తున్న వెంచర్లు
- సౌకర్యాలు అంతంత మాత్రమే
- అక్రమ లేఅవుట్లతో అవస్థలు
- లబోదిబోమంటున్న బాధితులు
- ప్రభుత్వ ఆదాయానికి సైతం గండి
- ఎల్ఆర్ఎస్‌తో క్రమబద్ధీకరించుకునే అవకాశం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అక్రమ వెంచర్లలో ప్లాట్లు కొన్న లబ్ధిదారులకు పాట్లు తప్పడం లేదు. కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అని కూడా చూడకుండా ప్లాట్లు కొని అవస్థలు పడుతున్నారు. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తమ వెంచర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని ప్లాట్లు కొన్నవారు కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చి వెళ్తున్నారు. వాస్తవానికి కాలువలు, విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యాల కల్పనతో పాటు పార్కులకు స్థలాన్ని వెంచర్ వేసిన యజమానులు కేటాయించాలి. అవేమీ లేకుండానే నగరపాలక పరిధిలో ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారు. నగరంలో ఇలా పలు అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారి అవస్థలు వర్ణనాతీతం, అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని అధికారులు సూచిస్తున్నారు.

అక్రమ వెంచర్లతో...

వ్యవసాయ భూములు, పారిశ్రామిక ప్రాంతాల్లో వెంచర్లకు అనుమతులు ఇవ్వరాదు. వ్యవసాయ, ప్రైవేటు భూముల్లో వెంచర్లు వేయాలంటే నిర్దీత రుసుము చెల్లించి కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఎన్‌వోసీ తీసుకుని ఎకరా, రెండెకరాల్లో ఉంటే లేఅవుట్లు అప్రూవల్ కోసం సంబంధిత గ్రామ పంచాయతీ, అదే 2.50 హెక్టార్లు ఉంటే మున్సిపాలిటీలకు వాటి పరిధికి మించి విస్తీర్ణం ఉంటే కుడాకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు రుసుము, పర్మిట్ ఫీజు, డెవలప్‌మెంట్ చార్జీ, గ్రీన్ ఫీజ్, డీపీఎంఎస్ యూజర్ చార్జీ, లేబర్ సెస్, కాంపోనెంట్-1,2, రుసుం చెల్లించాలి. కుడా అనుమతుల కోసం ఎకరాకు రూ.70వేల వరకు చలానా రూపంలో చెల్లించాలి. దీంతో పాటు వెంచర్‌లో పట్టణ ప్రణాళిక నిబంధనల ప్రకారం 10శాతం పార్కులకు వదలాలి. ఇతర అవసరాలకు ఓపెన్ సైట్ ఇవ్వాలి. 40అడుగుల విస్తీర్ణంలో రోడ్డు వేయాలి, ఓపెన్ సైట్, రోడ్ల కోసం 45 శాతానికి పైగా వదలాలి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన వివిధ ఫీజులకు గండి కొట్టడమే కాకుండా 20, 25, 30అడుగుల విస్తీర్ణం రోడ్డుతో అక్రమ లేఅవుట్లు వేస్తున్నారు. దీంతో కొనుగోలు చేసిన ఉద్యోగులు, చిరువ్యాపారులు, సామాన్యులు నష్టపోవాల్సి వస్తుంది. నాన్ లేఅవుట్ ప్లాట్లలో ఇళ్లు కట్టుకోవాలంటే అప్రూవల్ కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నగర పరిధిలో 41 అనధికార..

నగర పరిధిలో ఉన్న కల్లూరు మండలం సర్వే నంబరు 680/ఏ2, బీలో 2.5 ఎకరాల్లో వంశీ ఇన్ఫ్రా ప్రాజెక్టు, 1.7 ఎకరాల్లో వీరయ్య కృష్ణమూర్తి జాయింట్ వెంచర్, సర్వే నెంబరు 170 పార్టులో 6.1 ఎకరాల్లో వైష్ణవి లేఅవుట్, 171లో 3.59 ఎకరాల్లో వెంకటేష్, పందిపాడు సర్వే నెంబరు 144,157(పార్ట్)లో 2.22 ఎకరాల్లో సాయి అంజనాద్రి నగర్, పెద్దపాడు గ్రామ పరిధిలో సర్వే నెంబరు 38 పార్టులో 5.8 ఎకరాల్లో ప్రగతి లే అవుట్‌లు ఇవే కాకుండా మిగిలినవి కూడా అధికారులు గుర్తించారు. అర్బన్ మండల పరిధిలోని మామిదాలపాడులో సర్వే నెంబరు34/2లో 4.59 ఎకరాల్లో ఎస్.వీరయ్య, సర్వే నెంబరు.4-2, 4-2ఏ, 4-2బి, 4-2సి, 4-3లో 2.99 ఎకరాల్లో దామోదరం మోహన్, 204బి, 1ఏ2ఏ, 1ఏ3బి, 205-1, 210బి,లో 4.47 ఎకరాల్లో విజయనగర్ కాలనీ, 189, సి2ఏ, 189 సీ2బీలో 2.98 ఎకరాల్లో నందనం నగర్, 171, 2ఏ2ఎఫ్, 1ఏ1బీ, 2ఏ2బి, 17/1 ఏలో 1.62 ఎకరాల్లో శ్రీనిలయంతో పాటు జొహరాపురం, కర్నూలు రూరల మండల పరిధిలోని అక్రమ లే అవుట్లను కార్పొరేషన్, కుడా అధికారులు గుర్తించారు. ప్రభుత్వం ఇలాంటి వాటిని ఎల్ఆర్ఎస్ స్కీంలో క్రమబద్ధీకరించుకునేందుకు అవకాశం ఉంటుంది. కొనుగోలుదారులు సైతం అనుమతులు లేని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్థలాలు, నిర్మాణాలను కొనుగోలు చేసినట్లు గుర్తించారు. జోహరాపురం-15, మామిదాలపాడు-7, కల్లూరు-8, లక్ష్మీపురం-1, పందిపాడు-1, మునగాలపాడు-4, పెద్దపాడు-4, కర్నూలు-1లో అక్రమ లేఅవుట్లు 35 ఉన్నాయని అధికారులు గుర్తించారు.



ప్రభుత్వం కీలక నిర్ణయం

ఎల్ఆర్ఎస్‌పై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు 2025 జూన్ 30 వరకు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లు రెగ్యులరైజేషన్‌కు అవకాశం ఉంటుంది. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ కోసం 90రోజులు గడువు ఉంటుంది. ప్రతి ప్లాట్‌కి తప్పకుండా దరఖాస్తు చేసుకుని ఉండాలి. ప్లాట్ విలువ ఆధారంగా క్రమబద్ధీకరణ చార్జీలు ఉంటాయి. 5, 10 శాతం ఓపెన్ స్పేస్ లేకపోతే 14శాతం అదనపు చార్జీలు విధిస్తారు. పాత దరఖాస్తులకు కూడా అవకాశం ఉంటుంది. దీనికి సంబంధిచిన పోర్టల్ ఆగస్టు 1నుంచి అందుబాటులోకి వచ్చింది.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను అమలు చేస్తుంది. ఎవరైతే ప్లాట్లు కొన్నవాళ్లు, వేసిన వాళ్లకి ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని క్రమబద్ధీకరణ చేసుకుంటే బ్యాంకు రుణాలు, అన్ని రకాల సౌకర్యాలు వస్తాయి. దీనిని సద్వినియోగించుకోవాలి.

● సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కుడా చైర్మన్

ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

- నాలుగు రోజులకు రూ.92 లక్షల ఆదాయం
- డిప్యూటీ కమిషనర్ విజయరాజు

కౌతాళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవ స్థానంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. శ్రావణ మాసం సందర్భంగా నాలుగు రోజుల్లో భక్తులు సమర్పిం చిన కానుకలను దేవస్థానపు కాలక్షేపపు మండపం నగదు రూపంలో రూ.92,09,323, 50 విదేశీ డాలర్లు, బంగారం19 గ్రాముల, 500మిల్లి గ్రాములు, వెండి 23కిలోల 100 గ్రాములు వచ్చినట్లు డీసీ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులకు భక్తులు ఇలా తమవంతు సహకారాలు అందించేందుకు ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి వెంకటేష్, ఆదోని గ్రూపు ఆలయ పర్యవేక్షులు, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధానఅర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజుస్వామి, శివన్నస్వామి, బ్యాంకు సిబ్బంది, ఆలయ అర్చక సిబ్బంది, దేవస్థానపు సిబ్బంది పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

'పీఎం సూర్యఘర్'ను పకడ్బందీగా అమలు చేయండి

- సోలార్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి
- ఏపీఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్స్, ఐటీ డైరెక్టర్ అయూబ్‌ఖాన్



సోలార్‌పై విద్యుత్‌శాఖ సబ్ డివిజన్, డివిజన్ అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న అయూబ్‌ఖాన్

కల్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పీఎం సూర్యఘర్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏపీఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్స్, ఐటీ డైరెక్టర్ అయూబ్‌ఖాన్ ఆదేశించారు. బుధవారం కర్నూలు విద్యుత్‌భవన్‌లోని సమావేశ భవన్‌లో ఆయన జిల్లాలోని సబ్ డివిజన్, డివిజన్ అధికారులు, సోలార్ వెండర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి ఏపీఎస్పీడీసీఎల్ అసెస్‌మెంట్, ఎంక్వయిరీ ఎస్ఈ ఎం.కృష్ణారెడ్డి, కర్నూలు ఆపరేషన్ ఎస్ఈ ఉమాపతి హాజరయ్యారు. ఈ సందర్భంగా అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ప్రగతిని మండల, సెక్షన్‌ల వారీగా సమీక్షించారు. అభివృద్ధి చెందుతున్న ఏరియాల్లో ఉండే అధికారులు పట్టణంలో కనీసం 100, గ్రామీణ ప్రాంతంలో 20 సోలార్ యూనిట్లను నెలలోగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోవోల్టేజీలో హెచ్చు తగ్గులు లేకుండా వినియోగదారులందరికీ సిబ్బందిని అందుబాటులో ఉంచుతూ సంతృప్తి శాతం పెంచడానికి ప్రతి ఒక్కరూ కచ్చితంగా పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఈ ఓబులేసు, కన్‌స్ట్రక్షన్ ఈఈ ఎం.మహేశ్వరరెడ్డి, డీఈలు, ఏడీఈలు సోలార్ వెండర్లు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై కలెక్టర్ అసంతృప్తి

- శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని రంజిత్‌బాషా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగరంలో చేపడుతున్న పారిశుధ్య పనులు సక్రమంగా జరగడం లేదని కలెక్టర్ రంజిత్ బాషా అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యకలాపాలపై ఈఈలు, డీఈలు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, మేనేజర్, ఏఈలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. నగరంలోని బి.క్యాంపు నుంచి రాజ్‌విహార్ వరకు రోడ్ల పరిశుభ్రతపై సక్రమంగా విధులు నిర్వహించని ప్రజా ఆరోగ్య అధికారికి షోకాజ్ నోటీసులు, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కర్నూలు మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1200 మంది శానిటరీ వర్కర్లు ఉన్నప్పటికీ నగరాన్ని శుభ్రంగా ఉంచకపోతే ఎలా అని ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్యం, ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరగాలని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనరు, గూడూరు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కర్నూలు నగర సుందరీకరణలో భాగంగా బి.క్యాంపు నుంచి బస్టాండు వరకు ఉన్న డీవైడర్లకు ఆకర్షణీయంగా పెయింట్ వేయించాలని కమిషనర్‌ను ఆదేశించారు. కల్లూరులో ఉన్న 16 వార్డులకు ప్రతిరోజూ నీరు ఇచ్చేందుకు కమిటీ వేశామన్నారు. టిడ్కో గృహాలక సంబంధించి గృహాలు కేటాయింపు చేసిన వారికి హౌస్‌నెంబర్లు ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌తో మాట్లాడి రేషన్‌షాపు ఏర్పాటు చేయించాలన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ కమిషనర్లు విశ్వనాథ్, కృష్ణ, గంగిరెడ్డి, రమేష్‌బాబు, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శ్రీమఠంలో కాషాయ రంగు పరిమళ ప్రసాదం

- టెంకాయ కొట్టడం ప్రారంభం



కాషాయ రంగులో తయారు చేసిన పరిమళ ప్రసాదం

మంత్రాలయం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో భక్తులకు విక్రయించే పరిమళ ప్రసాదం బుధవారం నుంచి కాషాయ రంగు(యథాస్థితి)లోకి మార్చారు. చాతుర్మాస తొలి ప్రారంభంలో శాఖా వ్రతాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆదేశాల మేరకు కాషాయ రంగులో తయారుచేసే పరిమళ ప్రసాదాన్ని తెలుపు రంగులోకి మార్చిన విషయం తెలసిందే. మధ్వపీఠం అనుసరించి సంప్రదాయంగా వస్తున్న ఆచారం ప్రకారం టెంకాయ కొట్టడం, నైవేద్యానికి, అలంకార భోజనానికి గడ్డలు, కూరగాయలు, ఆకుకూరలు, సుగంధ ద్రవ్యాలైన యాలకులు, కేసరి, పచ్చకర్పూరం నెలరోజుల పాటు నిషేధం ఉన్న విషయం తెలిసిందే. మంగళవారం వరకు నెలరోజుల పాటు ఉన్న శాఖావ్రతం పూర్తికావ డంతో ద్వాదశి బుధవారం నుంచి కాషాయ రంగులో ప్రసాదం, టెంకాయ కొట్టడం ప్రారంభమైందని మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచారులు తెలిపారు.

వేరుశనగ గరిష్ఠ ధర రూ. 6,756

రూ.350 పైగా పతనమైన రేటు



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వేరుశనగ దిగుబడులతో పది రోజులుగా కళకళలాడుతుంది. బోరు బావులు, కాలువల కింద సాగైనా వేరుశనగ దిగుబడి చేతికందడంతో రైతులు విక్రయానికి భారీగా తీసుకొస్తున్నారు. బుధవారం 8,338 బస్తాలు వేరుశనగను రైతులు విక్రయానికి తెచ్చారు. అయితే గత ఐదు రోజుల ధరలను పోల్చితే క్వింటానికి రూ.350 పైగా ధర పతనమైంది. వర్షాలు వల్ల రైతులు నేరుగా పొలాల నుంచి పచ్చి వేరుశనగనే విక్రయానికి తీసుకొస్తున్నారని, దీనివల్ల ధర తగ్గిందని వ్యాపారులు తెలిపారు. విక్రయానికి ముందు ఇంటి వద్ద పొలాల్లో ఆరబెట్టుకొని వేరుశనగ దిగుబడును మార్కెట్‌కి తీసుకువస్తే మంచి ధర లభిస్తుందని చెబుతున్నారు. వేరుశనగ గరిష్ఠ ధర రూ.6,756, మధ్యస్థం రూ.6,369, కనిష్ఠం రూ.3049 పలికింది.

సీమ ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేయాలి

- గోదావరి-బనచర్ల ప్రాజెక్టును విరమించుకోవాలి
- ఈ ప్రాజెక్టు వల్ల రాయలసీమకు ప్రయోజనం లేదు
- విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు



మాట్లాడుతున్న రిటైర్డ్ డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు

కర్నూలు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను ప్రథమ ప్రాధాన్యతగా సత్వరమే పూర్తి చేయాలని విశ్రాంత డీజీపీ ఏబీ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి నాయకత్వంలో రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ, అక్కినేని భవానీప్రసాద్, రామారావు, నల్లబోతు చక్రవర్తి, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన కమిటీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, సీపీఐ నాయకులు జగన్నాథం, రామాంజనేయులు, రామచంద్రయ్య తదితరులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని హంద్రీ-నీవా, గోరుకల్లు, బనకచర్ల తదితర ప్రాజెక్టులు సందర్శించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు, కాలువలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కర్నూలు జిల్లా ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషాను కలిసి ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏఏ ప్రాజెక్టుకు ఎంత నిధులు అవసరం ఉందో, ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం స్థానిక ఎస్టీయూ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాయలసీమ జిల్లాల్లో సరాసరి రూ.4 వేల నుంచి రూ.5వేల కోట్లు ఖర్చు చేస్తే అసంపూర్తి ప్రాజెక్టులు పూర్తవుతాయని, రూ. 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఏబీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో ఒక్క చుక్క కూడా సీమ ప్రాంతంలో అదనంగా వాడుకోవడం లేదని తెలంగాణ సమాజం గుర్తించాలని, రాజకీయ స్వలాభం కోసం రాజకీయ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. గోదావరి జలాలు పంపకాలు సక్రమంగా జరగ లేదని, ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకొని పంపకాలు సక్రమంగా చేయాలని సూచించారు. వెలిగొండ సహా శ్రీశైలంపై ఆధారపడిన ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకు నీరు ఇచ్చేందుకు ప్రభుత్వం ఖర్చు చేయాలన్నారు. కృష్ణా డెల్టాలో చివరి ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు కృష్ణా జలాలు విషయంలో లేనిపోని సమస్యలు తెచ్చి పెట్టే ప్రమాదం లేకపోలేదు అన్నారు. తెలంగాణ కృష్ణాపై కడుతున్న పాలమూరు-రంగారెడ్డి సహా వివిధ ప్రాజెక్టులకు అనుమతులు లేవని, వాటికి అనుమతులు తెచ్చుకోవాలని ఆ రాష్ట్రానికి ఆయన సూచించారు. కేఆర్ఎంబీ ఆదేశాలను ఇరు రాష్ట్రాలు పాటిస్తూ నీటి సమస్యలు లేకుండా చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నవీనతకు సాక్ష్యాలు.. చేనేతలు 6

- మగ్గం ఉన్న చేనేతకు నేటి నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నేడు అంతర్జాతీయ చేనేత దినోత్సవం

36 మంది సీఐల బదిలీ 7

ఎమ్మిగనూరులో మగ్గాలపై చేనేత వస్త్ర ఉత్పత్తుల్లో నిమగ్నమైన నేత కార్మికుడు



నవీనతకు సాక్ష్యాలు.. చేనేతలు

- నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న వస్త్రాలు
- ఆకట్టుకునే డిజైన్లతో జరీ అంచు పట్టుచీరలు
- బర్డ్సై తువాళ్లు.. జిందగీ దుప్పట్లకు ఎమ్మిగనూరు ప్రత్యేకం
- మగ్గం ఉన్న చేనేతకు నేటి నుంచి 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- నేడు అంతర్జాతీయ చేనేత దినోత్సవం

చేయి తిరిగిన చేనేత కార్మికులు వారు.. వస్త్ర రంగంలో సరికొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. నేతన్నల చేతుల్లో రూపుదిద్దుకుంటున్న చేనేత వస్త్రాలు చిరకాలంగా గుర్తుండిపోతున్నాయి. అధునాతన డిజైన్లు.. సహజసిద్ధమైన రంగులు.. నవీనతకు సాక్ష్యాలుగా కర్నూలు జిల్లా నేతలు నిలుస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే సహకార రంగానికి పునాది వేసిన ఘనత ఎమ్మిగనూరు చేనేతలది. చెక్క మగ్గాలపై అందమైన తువాళ్లు, దుప్పట్లు, దోమ తెరలు, చీరలు, షర్టింగ్ వస్త్రాలు.. ఇలా వివిధ నూలు వస్త్రాలు జరీ అంచు పట్టుచీరలు తయారీలో వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. ప్రభుత్వం చేయూత అందిస్తే మగ్గాలపై అద్భుత వస్త్రాలు తయారు చేయగల నైపుణ్యం ఉంది. కూటమి ప్రభుత్వం నేత కార్మికులకు అండగా నిలుస్తూ.. మగ్గం కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చే కీలక పథకానికి నేడు శ్రీకారం చుట్టనుంది. నేడు జాతీయ చేనేతల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో చేనేత కార్మికుల నైపుణ్యం, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సమస్యలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

కర్నూలు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేనేతరంగం అంటే గుర్తుకొచ్చేది ఎమ్మిగనూరు. చేనేత పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్ప 1938లో 'ఎమ్మిగనూరు చేనేత సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం లిమిటెడ్‌ను స్థాపించారు. స్వాతంత్ర్యానికి ముందే సహకార వ్యవస్థకు పునాది వేశారు. దేశంలోనే అత్యుత్తమ చేనేత వస్త్ర ఉత్పత్తి బ్రాండ్‌గా మారింది. దుప్పట్లు (బెడ్‌షీట్లు), తువాళ్లు, లుంగీలు, చేతి రుమాలు, దోమతెరలు, షర్ట్ దుస్తులు, దోతీలు, చీరలు.. వంటి వివిధ రకాల చేనేత వస్త్ర ఉత్పత్తులకు నిలయమై చేనేతపురిగా ఖ్యాతి సొంతం చేసుకుంది. బర్డ్సై తువాళ్లు.. జిందగీ దుప్పట్లు ఎమ్మిగనూరు ప్రత్యేకం. ఆ తరువాత ఆదోని, కోడుమూరు, నందవరం, నాగులదిన్నె, గుడేకల్లు, పత్తికొండ, కర్నూలు, గోనెగండ్ల, వెల్దుర్తి వంటి ప్రాంత్రాల్లో చేతి మగ్గాలపై ఆధారపడి జీనవం సాగిస్తున్న దాదాపు 15 వేలకు పైగా చేనేత కార్మికులు కుటుంబాలు ఉన్నాయి. 14 చేనేత సహకార సంఘాలు ఉంటే ఒక్క ఎమ్మిగనూరు సహకార సంఘం ఒక్కటే నేతన్నలకు అండగా నిలుస్తూ ఉపాధి కల్పిస్తుంది. సహకార రంగంలో 1,039 కుటుంబాలు, సహకారేత రంగంలో 2,301 కుటుంబాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వాస్తవంగా అంతకంటే ఎక్కువ కుటుంబాలు చేనేత వస్త్ర ఉత్పత్తిపై ఆధార పడుతున్నారు.

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సొంత మగ్గం కలిగిన చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, మర మగ్గం ఉంటే 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడాది తరువాత ఈ పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నేడు జాతీయ చేనేతల దినోత్సవాన్ని పురష్కరించుకొని ప్రారంభించనున్నారు. కర్నూలు జిల్లాలో 2,457 చేనేత కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 385 కుటుంబాలు 200 యూనిట్లు ఉచితకు అర్హులుగా గుర్తించారు. ఒక్కో చేనేత కుటుంబానికి నెలకు రూ.1,200 ప్రకారం ఏడాది రూ.14 వేల నుంచి రూ.15 వేలు ఉచిత విద్యుత్ రూపంలో ఆర్థిక ప్రయోజనం కలుగుతుంది. మర మగ్గాలు కలిగిన కర్నూలు జిల్లాలో ఒకరికి, నంద్యాల జిల్లాలో 73 మందికి 500 యూనిట్లు చొప్పున ఉచిత విద్యుత్ అందించనున్నారు. అలాగే.. కర్నూలు జిల్లాలో 3,611 మంది, నంద్యాల జిల్లాలో 985 మంది 50 ఏళ్ల పైబడిన చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేలు చొప్పున పింఛన్ అందుతుంది.



చేనేతల ఉత్పత్తులు

45 ఏళ్లుగా మగ్గంపై ఆధారపడి జీవిస్తున్నాం



చేనేత వృత్తే మాకు జీవనాధారం. పోగులు వడికి పేగు నింపుకునే జీవితాలు మావి. 45 ఏళ్లుగా మగ్గంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. శ్రమకు తగిన కూలీ రావడం లేదు. మగ్గంపై నేత నేయడం తప్ప మరో వృత్తి తెలియదు. కష్టమైనా నష్టమైనా మగ్గమే ఆధారం. ఒక దుప్పటి నేస్తే రూ.150 ఇస్తున్నారు. రోజుకు రెండు దుప్పట్లు నేయడం కష్టమే. అంటే.. రోజంతా కష్టపడినా రూ.250 కూడా గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి. ఒకప్పుడు ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘంలో రూ.2 వేలకు పైగా చేనేత కార్మికులు జీవనం సాగించారు. ప్రస్తుతం 450 మంది కూడా లేరు. వారిలో సగం మంది కూడా మగ్గం నేయడం లేదు. మా తర్వాతి తరం మగ్గం నేసేందుకు ఆసక్తి చూపడం లేదు. మర మగ్గాల పోటీ కూడా తట్టుకోలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు చేయూతను అందించి చేనేతలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. నిర్లక్ష్యం చేస్తే చేనేత మగ్గం కనుమరుగయ్యే ప్రమాదం లేకపోలేదు.

– కనికె మల్లికార్జున, చేనేత కార్మికుడు, ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘం, ఎమ్మిగనూరు

జిల్లాలో చేనేతల వివరాలు

- చేనేత సహకార సంఘాలు : 14
- యాక్టివ్ సంఘాలు : 1 (ఎమ్మిగనూరు)
- సహకార రంగంలో సభ్యులు: 1,039
- సహకారేతర రంగంలో సభ్యులు : 2,301
- ఏ పట్టణంలో ఎందురు: ఎమ్మిగనూరు-1,430, కోడుమూరు -770, ఆదోని-330



2015 ఆగస్టు 7న తొలి జాతీయ చేనేత దినోత్సవం

భారతదేశ వైవిధ్యమైన సంస్కృతి, వారసత్వానికి చిహ్నం చేనేత రంగం. వ్యవసాయం తరువాత పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పిస్తున్న చేనేత వృత్తి. స్వాతంత్ర్య పోరాటంలో జాతిపిత మహాత్మాగాంధీ చేనేత చరక పట్టుకుని ఉద్యమ స్ఫూర్తి రగలించారంటే ఆ రోజుల్లో ఈ రంగం ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుస్తుంది. చేనేత, అనుబంధ నేత రంగాల్లో 70 శాతం కంటే ఎక్కువ శాతం ఆధారపడింది మహిళలే. 1905 ఆగస్టు 7న ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం దేశీయ పరిశ్రమలను, ముఖ్యంగా చేనేత కార్మికులను స్ఫూర్తి, ప్రోత్సాహం ఇచ్చింది. అందుకే ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించాలని 2015లో ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2015 ఆగస్టు 7న ప్రథమ జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రధాని మోడీ చెన్నైలో ప్రారంభించారు.

చేనేత దినోత్సవానికి ఏర్పాట్లు చేశాం



ఎమ్మిగనూరులో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అమలు చేస్తున్న చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ నేడు సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారు. కర్నూలు జిల్లాలో 2,457 చేనేత కుటుంబాలు, నంద్యాల జిల్లాలో 385 కుటుంబాలు అర్హులుగా గుర్తించాం. ఎమ్మిగనూరు టెక్స్‌టైల్ పార్క్ కోసం వివిధ పనుల కోసం ప్రాథమికంగా రూ.30.71 కోట్లు అవసరమని అంచనా వేశాం. త్రిఫ్ట్ ఫండ్, నూలు రాయితీ వంటి నిధులు మంజూరయ్యాయి.

– నాగరాజు యాదవ్, ఏడీ, ఏపీ చేనేత, జౌళి శాఖ, కర్నూలు

నేతన్నలకు అండగా ప్రభుత్వం

ఎమ్మిగనూరు మండలం బనవాసి జెర్సీ పశుక్షేత్రం వద్ద 77 ఏకరాల్లో టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. రూ.43 కోట్లలో వివిధ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- చేనేత సమీకృత కార్యక్రమం (సీడీపీ) రెండో విడతలో పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వం ఆమోదం తెలపాల్సి ఉంది. నిధులు మంజూరు అయితే ఎమ్మిగనూరు క్లస్టర్‌లో 251, ఆదోని క్లస్టర్‌లో 233 మంది చేనేత కార్మికులకు మగ్గాలు, మగ్గం పరికరాలు మంజూరు అవుతాయి.
- ఎమ్మిగనూరులో 'వీవర్స్ శాల' ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కార్యరూపం దాలిస్తే అధునాతన మగ్గాలు, వార్పింగ్, డైయింగ్, సైజింగ్.. అన్ని ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. వీవర్స్ శాల నిర్మాణం కోసం ఎకరం భూమి అవసరం కాగా.. ఆదోని సబ్ కలెక్టర్ ఏపీ టిడ్కో హౌసింగ్ కాలనీలో 86 సెంట్లు స్థలం గుర్తించి కలెక్టరుకు నివేదిక పంపారు. అవసరమైన నిధులు రూ.1.20 కోట్లు ఎంపీ ల్యాండ్ నుంచి ఇచ్చేందుకు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్పష్టమైన హామీ ఇచ్చారు.
- నేషనల్ హ్యాండ్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌హెచ్‌డీసీ) నుంచి కొనుగోలు చేసిన నూలుపై 20 శాతం రాయితీ 2021-22కు ఎమ్మిగనూరు రూ.25.38 లక్షలు ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి విడుదల చేశారు. 236 మంది చేనేతలకు ప్రయోజనం కలుగనుంది.
- చేనేత సహకార సంఘాల్లో పని చేసే కార్మికులకు ఆర్థిక చేయూత కోసం 2019లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం 'త్రిఫ్ట్ నిధి' అమలులోకి తెచ్చింది. నేత కార్మికుడు రోజువారి వేతనంలో 8 శాతం చెల్లిస్తే, ప్రభుత్వం 16 శాతం చేర్చి త్రిఫ్ట్ నిధి ఖాతాకు జమ చేస్తుంది. ఎమ్మిగనూరు చేనేత సహకార సంఘానికి ఒక్కటే రూ.18 లక్షలు మంజూరు చేశారు.

చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూత

- జిల్లాలో 14 సహకార సంఘాలు
- 3,611 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.4 వేలు పింఛన్
- చేనేత సహాయ సంచాలకుడు రాజారావు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేనేత కార్మికులకు ఉపాధి అవకాశాలను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని కర్నూలు జిల్లా చేనేత శాఖ సహాయ సంచాలకుడు జి.రాజారావు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని చేనేత, జౌళి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడారు. జిల్లాలోని ఎమ్మిగనూరు, ఆదోని, కోడుమూరు, గడేకల్, నాగులదిన్నె, కోసిగి, గూడూరు ప్రాంతాల్లో చేనేత పరిశ్రమ విస్తరించి ఉందని, జిల్లాలో 14 సహకార సంఘాలు ఉన్నాయని తెలిపారు. చేనేత కార్మికుల అభివృద్ధి కోసం ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయడం జరుగుతోందని, నెలకు 200 యూనిట్ల విద్యుత్ రాయితీని అందిస్తున్నామన్నారు. 2,457 చేనేత కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. మరమగ్గాల ద్వారా వస్త్రాలు తయారు చేసే వారికి నెలకు 500 యూనిట్ల విద్యుత్ అందిస్తున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలో 3,611 మంది చేనేత కార్మికులకు నెలకు రూ.4వేల చొప్పున పింఛన్ అందిస్తున్నామని, దీని కోసం రూ.1.44 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ముద్ర పథకం ద్వారా 166 మంది చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి 50వేల చొప్పున రూ.83లక్షలు మంజూరు చేశారన్నారు. కలెక్టర్ ఎమ్మిగనూరులో టెక్స్‌టైల్ పార్కు కోసం 77 ఎకరాల ఖాళీస్థలాన్ని ఏపీఐఐసీ వారికి అందించారన్నారు. మే 6వ తేదీన చేనేత, జౌళిశాఖ మంత్రి టెక్స్‌టైల్ పార్కు యొక్క శిలాఫలకాన్ని ఆవిష్కరించారని, త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదికను తయారు చేసి జిల్లాలోని చేనేతలకు ఉపాధి అవకాశాలు పెంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.

వయోవృద్ధుల సంక్షేమం కోసం చట్టం

కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వయోవృద్ధులు, తల్లిదండ్రుల నిర్వహణ, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టంను ప్రవేశపెట్టారని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం-2007 అమలుపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్థికస్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలు సంరక్షించని పక్షంలో మెయింటెనెన్స్ కోసం సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ లేదా ఆర్డీవోకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జిల్లాలో 15 వృద్ధాశ్రమాలు ఉన్నాయని, వాటిని జిల్లా అధికారులు విజిట్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఆర్డీవోలు సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ ఉప ముఖ్యమంత్రి

మంత్రాలయం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఈశ్వరప్ప కుటుంబ సమేతంగా బధవారం సాయంత్రం మంత్రాలయానికి వచ్చారు. ఆయనకు ఆలయ మహ ముఖద్వారం వద్ద శ్రీ మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచార్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. హెచ్‌పీఐఎల్ ఇండిపెండెంట్ డైరెక్టర్ గిరీష్ కనకవీడు, ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రీనాథ్, ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజ ఆచార్ పాల్గొన్నారు.



ఈశ్వరప్పను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతి

12న జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12వ తేదీన జిల్లాలో జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జాతీయ నులి పురుగుల నిర్మూలనపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నులి పురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని స్కూల్ పిల్లలు, కాలేజీ విద్యార్థులకు నుటి పురుగుల నివారణ ఆవశ్యకత గురించి పూర్తి అవగాహన కల్పించి 1-19 సంవత్సరాల వయస్సు వారికి అల్బెండజోల్ మాత్రలు అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ మాత్రలు అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శాంతికళ, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ పాల్గొన్నారు.

నారుమడి.. సిద్ధం చేయండిలా

- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- ఎకరా వరి నాటుకు ఐదు సెంట్ల మడి
- నాణ్యమైన నారుమడితో అధిక దిగుబడులు

శిరివెళ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కేసీ కెనాల్, తెలుగుగంగ, కుందూ, ఎల్లెల్సీ తదితర కాల్వల నీరు ప్రధాన వనరుగా పంటలు సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు. రైతులు అధికంగా సాగుచేసే వరి పైరుకు ముందు నారుమడి తయారీలో యాజమాన్య పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో నారుమడి తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం.



రైతులు సాగు చేసిన వరి నారుమడి

నారుమడి తయారీ

ఎకరా పొలంలో వరి నాట్లు వేయడానికి గాను ఐదు సెంట్ల నారుమడి సరిపోతుంది. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు దమ్ము చేసి చదును చేయాలి. నారుమడికి నీరు పెట్టేందుకు, నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా చిన్న చిన్న కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ఐదు సెంట్ల నారుమడికి రెండు కిలోల నత్రజని, కిలో పోటాష్, కిలో భాస్వరం చొప్పున ఎరువులను దుక్కిలో వేయాలి. ఎంపిక చేసుకున్న నాణ్యమైన విత్తనాలను 24 గంటల పాటు నీళ్లలో నానబెట్టి బయటకు తీసి మరో 24గంటల పాటు మండె కట్టి ఉంచాలి. ఆ తర్వాత మొలకలు వచ్చిన విత్తనాలను ఒక సెంటుకు 5 నుంచి 6 కిలోల చొప్పున మడిలో చల్లుకోవాలి. నారు మొలకెత్తే సమయంలో ఆరుతడులు ఇచ్చి తర్వాత నీరు పలుచగా కట్టుకోవాలి. మడిలో నీరు ఎక్కువైతే నారు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

నారుమడిలో సస్యరక్షణ

నారుమడిలో సస్యరక్షణ చేపట్టడం ద్వారా నాణ్యమైన వరి నారు లభిస్తుంది. మొదటగా విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయడం ద్వారా తెగుళ్లను సమర్థవంతంగా నివారించే బలం చేకూరుతుంది. కిలో వరి విత్తనానికి మూడు గ్రాముల కార్బండైజిమ్‌ను కలిపి 24 గంటల తర్వాత మడిలో చల్లుకోవాలి. నారుమడిలో జింక్ లోపాన్ని గుర్తిస్తే లీటరు నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలి. జింక్‌ను ఇతర మందులతో కలుపకూడదు. మడిలో అగ్గి తెగులు నివారణకు లీటరు నీటికి 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ లేదా రెండు మిల్లీ లీటర్ల కాసుగామైసిన్ కలిపి పిచికారీ చేయాలి. నారు తీయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్ గుళికలు ఒక సెంటుకు 160 గ్రాముల చొప్పున వేయాలి. నారు నాటే ముందు వేర్లను 50 లీటర్ల నీటిలో 100 ఎంఎల్ క్లోరిపైరిఫాస్, 2.5 కిలోల యూరియాను కలిపిన ద్రావణంలో దాదాపు అరగంట సేపు ఉంచి నాటుకుంటే పంటలో చీడపీడలు నివారించబడతాయి.

విత్తన శుద్ధి చేయాలి



వరి పైరు సాగు చేసేందుకు నారుమడి సిద్ధం చేసే సమయంలో విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి. నాణ్యమైన నారుతో మంచి దిగుబడులు వస్తాయి. మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వినియోగిస్తే దిగుబడులపై ప్రభావం చూపుతుంది. నారుమడిలో యాజమాన్య పద్ధతులపై గ్రామాల్లోని వ్యవసాయ శాఖ సిబ్బందితో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

● సుధాకర్, వ్యవసాయాధికారి, శిరివెళ్ల

సమష్టి కృషితో కళల నిలయంగా తీర్చిదిద్దుదాం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రం నూతన కమిటీ ఎన్నిక



టీజీ వెంకటేశ్, జి. పుల్లయ్య, బీవీ రెడ్డి, కేఎస్‌వీ రాజశేఖర్‌తో నూతనంగా ఎన్నికైన కమిటీ ప్రతినిధులు, సభ్యులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో టీజీవీ కళాక్షేత్రాన్ని కళల నిలయంగా తీర్చిదిద్దుదామని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ కళాకారులకు పిలు పునిచ్చారు. బుధవారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కళాక్షేత్రం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 150మందికి పైగా శాశ్వత సభ్యులు, కవులు, కళాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఎక్కడ అభివృద్ధి ఉంటుందో అక్కడ విమర్శలు కూడా సహజమేనన్నారు.

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఈకళాక్షేత్రం కళలు, సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోందని, రాబోయే కాలంలో మరిన్ని నిధులు కేటాయించి నిత్యకల్యాణం పచ్చతోరణంగా తీర్చిదిద్దుతామన్నారు. టీజీవీ కళాక్షేత్రం కళాకారులకు ఉపయోగకరంగా నిలవాలని, అందుకు కొత్త కమిటీ బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అవసరమైతే రాబోయే ఆరు నెలల్లో కమిటీల్లో మార్పుచేర్పులు ఉంటాయని హామీ ఇచ్చారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ టీజీ వెంకటేశ్ సహకారంతో, సూచనలతో కళాక్షేత్రంలో నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేలా కార్యాచరణతో ముందుకు పోతున్నామని చెప్పారు. గౌరవ అతిథులుగా విచ్చేసిన రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, పారిశ్రామికవేత్త, బ్రహ్మర్షి బీవీ రెడ్డి, మాంటిస్సోరి విద్యాసంస్థల డైరెక్టర్ కేఎస్‌వీ రాజశేఖర్ మాట్లాడుతూ కర్నూలులో టీజీ వెంకటేశ్ ఎంతో శ్రమించి నిర్మించిన కళాక్షేత్రం రాయలసీమలోనే అతిపెద్ద ఆడిటోరియంగా నిలిచిపోతోందని చెప్పారు. కళాకారులు ఈ క్షేత్రాన్ని ముందుకు తీసుకుపోవడంలో కృషి చేయాలని కోరారు.

నూతన కమిటీని ప్రకటించిన టీజీ వెంకటేశ్

ఈ ఏడాది మార్చి 31 వరకు ఉన్న కళాక్షేత్రం వార్షిక నివేదికను కళాక్షేత్రం మేనేజర్ బాషా తెలియజేశారు. అనంతరం టీజీవీ కళాక్షేత్రం నూతన కమిటీని టీజీ వెంకటేశ్ ప్రకటించారు. కళాక్షేత్రం చీఫ్ అడ్వైజర్లుగా జి. పుల్లయ్య, డాక్టర్ బీవీ రెడ్డి, కేఎస్‌వీ రాజశేఖర్‌ను ప్రకటించారు. కళాక్షేత్రం అధ్యక్షుడిగా మరోసారి కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా యాగంటీశ్వరప్ప నియమితులయ్యారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాలవెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా దాశెట్టి శ్రీనివాసులు, ఎస్. మహమ్మద్‌మియా, కోశాధికారిగా కె.రామస్వామి, సంయుక్త కార్యదర్శులుగా సంగా ఆంజనేయులు, ఎస్ఎండీ ఇనాయతుల్లా, కె. శివయ్య, ఈసీ మెంబర్లుగా కేవీ రమణ, డి. ఈశ్వరయ్య, కె. రమేష్, గాండ్ల లక్ష్మన్న, పి. రాజారత్నం, పీపీ గురుమూర్తి, సీఎస్ మద్దయ్య, రాముడు, జీవీ శ్రీనివాసరెడ్డి ఎన్నికయ్యారు. ఈ కమిటీకి సలహా దారులుగా సీవీ రెడ్డి, బలరాం, పాండురంగయ్య, ఎన్‌డీ క్రిష్టఫర్, ఎస్కే లక్ష్మీకాంతారావు నియమితులయ్యారు.



పత్తి ఓబులయ్య



యాగంటీశ్వరప్ప

పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తూ..

- అనంతలోకాలకు తండ్రి
- బైక్‌ను ఢీకొట్టిన మినీ బస్సు


వెంకటరమణ (ఫైల్)

ఓర్వకల్లు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు వెళ్తూ ఓ వృద్ధుడు అనంతలోకాలకు చేరాడు. ఈ ఘటన మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై సోమయాజులపల్లె గ్రామానికి సమీపంలో గల బేతంచెర్ల యూటర్న్ వద్ద చోటుచేసుకున్నట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. సోమయాజులపల్లెకి చెందిన వెంకటరమణ(65) తన కుమారుడు మధుబాబు పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు బుధవారం చెన్నంచెట్టిపల్లె గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామానికి సమీపంలో యూటర్న్ వద్ద దాటుతుండగా నంద్యాల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న మినీ బస్సు ఢీకొనడంతో వెంకటరమణ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యుల ఘటనాస్థలికి చేరుకొని శోకసంద్రంలో మునిగి పోయారు. మృతుని కుమారుడు మధుబాబు వివాహం ఈనెల 13, 14 తేదీల్లో జరగాల్సి ఉంది. మృతుడికి ఐదు మంది కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హెల్త్ అసిస్టెంట్లకు రీడిప్లాయిమెంటు

- ఉత్తర్వులు జారీ చేసిన డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న ఐదు మంది హెల్త్‌అసిస్టెంట్లు (మేల్)లను రీడిప్లాయిమెంటు చేస్తూ కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ ఉత్తర్వులు జారీ చేశారు. మే నెలలో ఉమ్మడి జిల్లాలోని 40 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్)లను ఏ జిల్లా పరిధిలో ఉన్న ఉద్యోగులను అదే జిల్లాలో కౌన్సెలింగ్ నిర్వహించి రీడిప్లాయిమెంటు చేశారు. రెండు నెలలు కాక ముందు ఎన్‌వీ బీడీసీ కింద ఐదు మంది హెల్త్ అసిస్టెంటను రిడిప్లాయిమెంటు చేశారు. చిన్నరాముడు నంద్యాల జిల్ల బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీ నుంచి కర్నూలు రోజా-2 అర్బన్ హెల్త్ సెంటర్‌కు, ఎస్.అనిల్ కుమార్ స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ కర్నూలు నుంచి నందికొ ట్కూరు యూపీహెచ్‌సీకి, ఎం.వెంకటస్వామి నందికొట్కూరు యూపీహెచ్‌సీ నుంచి స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ. వై.రామాంజనేయులు లద్దగిరి పీహెచ్‌సీ నుంచి తుగ్గలి పీహచ్‌సీ, ఎం.మురారయ్య హాలహర్వి (ఎన్) పీహెచ్‌సీ నుంచి పెద్దతుంభలం పీహెచ్‌సీకి, మాడిఫికేషన్ ఆర్డర్స్‌ను డీఎంహెచ్‌వో ఇచ్చారు. రెండు నెలల క్రితంలో ఉమ్మడి జిల్లాలో ఎంపీహెచ్‌ఏ (ఎం)లకు డెంగీ, మలేరియా వ్యాధుల నియంత్రణలో భాగంగా రీడిప్లాయిమెంటు చేశారు. కమిషనర్, కలెక్టర్ అనుమతి లేకుండా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఐదు మంది ఉద్యోగులకు ఉన్న ఫలంగా ఎలా రీడిప్లాయిమెంటు చేస్తారని కొన్ని ఉద్యోగ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. దీని వెనుక కొంత సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 40 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్)ను ఒకేసారి ఏ జిల్లా పరిధిలో ఉన్న వారిని అక్కడే రిడిప్లామెంట్ చేసిన అధికారులు ఇప్పుడు ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు ఎలా రిడిప్లాయిమెంట్ చేశారో అధికారులకే తెలియాలి. దీనిపై కర్నూలు డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళను రాత్రి ఫోన్‌లో వివరణ కోరగా ఆమె అందుబాటులో రాలేదు.

అమ్మా.. ఇక సెలవ్..!

- హరితా క్షమించు... నా టైం ఇక్కడితో అయిపోయింది..
- రూ.35 వేలకు రూ.1.20 లక్షలు కట్టా.. ఇక కట్టలేను..
- సెంట్రల్ బ్యాంకు ఉద్యోగి ఆవేదన
- అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్య బ్యాంకులోనే ఉరి
- అప్పుల వేధింపులు అంటూ సూసైడ్ నోట్

'అమ్మా.. ఇక సెలవ్. హరితా నన్ను క్షమించు. నేను బతికి మీకు ఎలాంటి లాభం లేదు. పిల్లల్ని, నిన్ను వదిలి వెళ్లాలంటే మనసు ఒప్పుకోవడం లేదు. నేను చేసుకున్న అప్పులే నా పాలిట శాపం అయ్యాయి. నా టైం ఇక్కడితో అయిపోయింది. రూ.50 వేలు అప్పు తీసుకుంటే... రూ.15 వేలు పట్టుకుని రూ.35 వేలు ఇచ్చారు. ప్రతినెలా రూ.15,000 ఇచ్చాను. వడ్డీ కడుతూ ఇప్పటి వరకూ రూ. 1.20 లక్షలు కట్టాను. ఇంక నా వల్ల కాదు.'

ఇవీ అప్పుల బాధలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు భరించలేక ప్రాణం తీసుకున్న బ్యాంకు ఉద్యోగి రాసుకున్న ఆఖరి మాటలు. రూ.35 వేలు తీసుకుంటే... ఇప్పటి వరకూ రూ.1.20 లక్షలు కట్టాడంటే.. వడ్డీ వ్యాపారులు ఏ స్థాయిలో వసూళ్లు చేశారో చెప్పనక్కర్లేదు.


రవికుమార్ (ఫైల్)

అనంతపురం క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక గుత్తి రోడ్డులోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి రవికుమార్ (40) అప్పుల బాధలు భరించలేక బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. బ్యాంకులోనే ఉరేసు కుని, ప్రాణం తీసుకున్నాడు. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలులోని సీ క్యాంపు ప్రాంతానికి చెందిన సంకుల రవికుమార్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి స్థానిక వినాయకనగర్‌లో స్థిరపడ్డాడు. భార్య హరిత, పిల్లలు సూర్యతేజ(13), దీక్షిత(11), వీక్షిత (10) ఉన్నారు. 12 ఏళ్లుగా బ్యాంకులో సబ్ స్టాఫ్(దస్తరీ)గా పనిచేస్తుండేవాడు. బుధవారం ఉదయం 9.45 గంటలపుడు బ్యాంకుకు వెళ్లాడు. కాసేపు అక్కడి ఉద్యోగులతో మాట్లాడాడు. అంతకుముందు భార్యకు ఫోన్ చేసి మనసు బాగోలేదని చెప్పాడు. తర్వాత 9.50గంటలకు బ్యాంకులోని వాష్ రూమ్‌కు వెళ్లి కిటికీకి కొత్తగా తెచ్చుకున్న నైలాన్ తాడుతో ఉరి వేసుకున్నాడు. వాష్‌రూమ్ తలుపులు తీయకపోవడంతో గుర్తించిన బ్యాంకు సిబ్బంది, ఇంటికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. బ్యాంకు మేనేజర్ వేణుగోపాల్, అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో కార్పెంటర్ ఓపెన్ చేసి చూడ గా... ఉరివేసుకుని, మరణించాడు. సమాచారం అందుకున్న త్రీటౌన్ సీఐ శాంతిలాల్, వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

అధిక వడ్డీ వేధింపులే..

రవికుమార్‌ను అప్పులు, అధిక వడ్డీ వేధింపులే బలి తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. 35 వేలకు ఇప్పటికే రూ.1.20 లక్షలు కట్టాననీ, ఇక కట్టలేనంటూ సూసైడ్ లెటర్‌లో పేర్కొనడం చూస్తేంటే.. వడ్డీలు కట్టడానికి జీతం చాలట్లేదని స్పష్టమవుతోంది. మరికొందరి వద్ద తీసుకున్న అప్పులు కూడా అతడికి భారంగా మారినట్లు స్పష్టమవుతోంది. రవికుమార్ మూడు రోజులపాటు సెలవు తీసుకున్నాడని బ్యాంకు సిబ్బంది ద్వారా తెలుస్తోంది. సెలవు ముగించుకుని వచ్చీ రాగానే... బ్యాంకు ఉద్యోగులు, కుటుంబీకులను ఒకసారి మాట్లడించి, అఘాయిత్యానికి పాల్పడినట్లు సమాచారం. రవికుమార్ మృతదేహాన్ని వాష్‌రూమ్ నుంచీ బయటకు తీయగానే... భార్య హరిత, ఇతర కుటుంబీలు కన్నీరుమున్నీరయ్యారు. తోటి బ్యాంకు ఉద్యోగులు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు. కొందరు ఉద్యోగులకు నోట మాట రాలేదు. హరిత ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అధిక వడ్డీలకు అడ్డుకట్ట వేయాలి

అధిక వడ్డీ వేధింపుల కారణంగానే బ్యాంకు ఉద్యోగి రవికుమార్ ఆత్మహత్య చేసుకున్నారని అధిక వడ్డీల వ్యతిరేక పోరాట స మితి జిల్లా అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. రవి మృతదేహాన్ని హరితో పాటు మరికొందరు మార్చురీ వద్ద సందర్శించి, అతడి కుటుంబీకులను ఓదార్చారు. తర్వాత ఆయన మాట్లాడుతూ... నగరంలో వడ్డీ వ్యాపారుల అరాచకాలు ఎక్కువయ్యాయన్నారు. వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే... ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. కాల్ మనీ కేటుగాళ్లను ప్రభుత్వం, పోలీసులు కట్టడి చేయాలని డిమాండ్ చేశారు.

రీవ(వ్రే)రిఫికేషన్

- సదరం శిబిరానికి బారులుదీరిన దివ్యాంగులు
- 50మందికి గానూ 800 మంది హాజరు
- అధికారుల సమన్వయ లోపం
- సరైన సౌకర్యాలు కల్పించని వైనం
- మళ్లీ రమ్మన్నారంటూ ఆవేదన

దివ్యాంగులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తోంది. ఈనెల పింఛన్లు రాక చాలా మంది అవస్థలు పడ్డారు. ఈనెల దివ్యాంగుల పింఛన్‌ను అధికారులు హోల్డ్‌లో పెట్టారు. జిల్లావ్యాప్తంగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు సదరం శిబిరాల్లో రీవెరిఫికేషన్ చేయించుకోవాలి. దీని కోసం కర్నూలు జీజీహెచ్‌లో సదరం శిబిరానికి బారులు దీరారు. మంత్రాలయం, పత్తికొండ, హోళగుంద, ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, నందవరం వంటి సుదూర ప్రాంతాల నుంచి నడవలేని వారు ఇతర దివ్యాంగులు ఆటోలు, జీపు, బస్సుల్లో తరలివచ్చారు. వాస్తవానికి కర్నూలు జీజీహెచ్‌లో బుధవారం కేవలం 50మందికి మాత్రమే రీవెరిఫికేషన్ ఉంది. 50 మందికి గానూ 800 మంది దివ్యాంగులు సదరం శిబిరానికి వచ్చారు. ఆస్పత్రిలో కనీసం వారికి తాగడానికి నీరు కూడా లేక ఇబ్బందులు పడ్డారు.


సదరం శిబిరానికి భారీగా వచ్చిన దివ్యాంగులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సదరం శిబిరాల నిర్వహణ గందరగోళంగా మారింది. ఈనెల దివ్యాంగుల పింఛన్‌ను అధికారులు హోల్డ్‌లో పెట్టడంతో పింఛన్‌ను నిలుపుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులు సదరం శిబిరాల్లో రీవెరిఫికేషన్ చేయించుకోవాలి. ఇందు కోసం ప్రభుత్వం జిల్లావ్యాప్తంగా సదరం శిబిరాలను ఏర్పాటుచేసింది. జిల్లాలో ఆర్థో, వినికిడి, కంటి, మానసిక సమస్యలతో దాదాపు 40 వేలకు పైగా సదరం సర్టిఫికెట్ల ద్వారా ఒక్కొక్కరు రూ.6వేల పింఛన్లు పొందుతున్నారు. ఆగస్టు నెలలో మూడు వేల మంది దివ్యాంగుల పింఛన్‌ను హోల్డ్‌లో పెట్టారు.

సుదూర ప్రాంతాల నుంచి..

రీవెరిఫికేషన్‌కు సదరం శిబిరాలకు వెళ్లని దివ్యాంగుల పింఛన్‌ను నిలుపుదల చేయడంతో బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సదరం శిబిరానికి బారులు దీరారు. మంత్రాలయం, పత్తికొండ, హోళగుంద, ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, కౌతాళం, కోసిగి, నందవరం వంటి సుదూర ప్రాంతాల నుంచి నడవలేనివారు ఇతర దివ్యాంగులు ఆటోలు, జీపు, బస్సుల్లో తరలివచ్చారు. వాస్తవానికి కర్నూలు జీజీహెచ్‌లో బుధవారం కేవలం 50 మందికి మాత్రమే రీవెరిఫికేషన్ ఉంది. 50మందికి గానూ 800 మంది దివ్యాంగులు సదరం శిబిరానికి రావడంతో సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెం డెంట్ డా.కే.వెంకటేశ్వర్లు శిబిరానికి చేరుకుని మరలా తేదీని రీవెరిఫికేషన్ కోసం ఇవ్వాలని ఆదేశించారు.

తాగునీరు కూడా లేక..

దివ్యాంగులు సదరం, సచివాలయ సిబ్బంది ఇచ్చిన నోటీసులను చేతబట్టి బారులు తీరారు. మధ్యాహ్నం 3గంటల వరకు దివ్యాంగులు నడవలేని వారు అవస్థలు పడ్డారు. ఎక్కువ సంఖ్యలో దివ్యాంగులు రావడంతో తాగడానికి కూడా మంచినీరు లేక ఇబ్బందులు పడ్డారు. రీవెరిఫికేషన్‌లో వైద్యులతో తాము ఎక్కువ పర్సంటేజీ వేయిస్తా మంటూ కొందరు దళారీలు దివ్యాంగులను నమ్మబలుకుతున్నారనికొందరు ఫిర్యాదు చేశారు. సదరం సిబ్బంది మాత్రం ఏ మాత్రం పట్టించుకోక పోవడం విశేషం. చివరకు దివ్యాంగులకు రీవెరిఫికేషన్ తేదీలను రాసి ఇవ్వడంతో మధ్యాహ్నం 3గంటలకు వెనుదిరిగారు.


దివ్యాంగులకు తేదీలను రాసి ఇస్తున్న సదరం క్లర్క్

రూ.2వేలు ఖర్చుపెట్టి ఆటోలో వచ్చా



మాది ఆస్పరి మండలం ముత్తుకూరు గ్రామం. ఈనెల దివ్యాంగుల పింఛన్ ఇవ్వలేదు. సచివాలయ సిబ్బంది కర్నూలు వెళ్లి సదరం శిబిరంలో వైద్యులతో పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు తెచ్చుకోవాలన్నారు. దీంతో నడవలేని తాను రూ.2వేలు ఖర్చు పెట్టి ఆటోలో వచ్చాను. తీరా ఇక్క డికి వస్తే మళ్లీ రమ్మన్నారు. **- చంద్రన్న పింఛన్‌దారుడు, ముత్తుకూరు, ఆస్పరి మండలం.**

తీరా ఇక్కడికి వస్తే వెనక్కు.



పింఛన్ రాలేదని ఆదోని నుంచి ఆటోలో కర్నూలుకు వచ్చా. నడవలేను కాబట్టి ఆటోలో వచ్చాను. నాకు రూ.6వేల పింఛన్ వచ్చేది. అది ఈనెల రాలేదు. దీంతో కర్నూలు సదరం శిబిరానికి వెళ్లాలన్నారు. తీరా ఇక్కడకు వస్తే వెనక్కు పంపారు. **- మల్లికార్జున, పింఛన్‌దారుడు, ఆదోని**

36 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో 36 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎ.గంగాధర్	వీఆర్, కర్నూలు	ఆస్పరి, యూపీఎస్
డి.మస్తాన్‌వలి	ఆస్పరి యూపీఎస్	వీఆర్, కర్నూలు
డి.హేమంత్ కుమార్ రెడ్డి	వీఆర్, కర్నూలు	అడిషినల్ ఎల్‌వోపీ, కర్నూలు వన్‌టౌన్, యూపీఎస్
ఎం.నాగశేఖర్	అడిషినల్ ఎల్‌వోపీ, కర్నూలు వన్‌టౌన్, యూపీఎస్	సీసీఎస్-1, కర్నూలు
ఎం.రామయ్య నాయుడు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్	డీటీసీ, కర్నూలు
ఎం.పార్థసారధి	డీటీసీ, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్ యూపీఎస్
కె.శ్రీనివాస నాయక్	సీసీఎస్-1, కర్నూలు	ఆదోని ట్రాఫిక్ యూపీఎస్
జి.సుబ్బారావు	ఆదోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్	కడప వీఆర్
జె.రమేష్ కుమార్	నంద్యాల, వీఆర్	సీసీఎస్-2, కర్నూలు
ఎస్.అస్రార్ బాషా	సీసీఎస్-2, కర్నూలు	నంద్యాల టూటౌన్ యూపీఎస్
ఎస్‌కే ఇస్మాయిల్	నంద్యాల టూటౌన్ యూపీఎస్	సీసీఎస్-2, నంద్యాల
పూల రామకృష్ణ	సీసీఎస్-2, నంద్యాల	డీసీఆర్‌బీ, నంద్యాల
ఎన్. కృష్ణయ్య	డీసీఆర్‌బీ నంద్యాల	వీఆర్ కడప
పి.నరేష్‌బాబు	ఎర్రగుంట్ల యూపీఎస్	జమ్మలమడుగు యూపీఎస్
ఎస్.లింగప్ప	జమ్మలమడుగు, యూపీఎస్	బద్వేల్ యూపీఎస్
కె.రాజగోపాల్	బద్వేల్ యూపీఎస్	ప్రొద్దుటూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
సి.భాస్కర్ రెడ్డి	వీఆర్, కడప	జమ్మలమడుగు రూరల్ సర్కిల్
ఎస్.విశ్వనాథ్ రెడ్డి	రాయచోటి ట్రాఫిక్ స్టేషన్	ఎర్రగుంట్ల యూపీఎస్
ఎ.సురేష్ రెడ్డి	వీఆర్, కడప	సోషల్ మీడియా, సైబర్ సెల్, కడప
పి.రాజ	రాజంపేట, యూపీఎస్	కొండాపురం సర్కిల్
పి.మహ్మద్ రఫీ	కొండాపురం సర్కిల్	మదనపల్లి వన్‌టౌన్ యూపీఎస్
డి.నాగార్జున	వీఆర్, కడప	రాజంపేట యూపీఎస్
ఎస్.కుల్లాయప్ప	మన్నూరు యూపీఎస్	రాయచోటి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్
జె.ప్రసాద్‌బాబు	వోయాలపాడు సర్కిల్	మన్నూరు యూపీఎస్
ఎస్.అనిల్ కుమార్	కలకాడ సర్కిల్	కలికిరి యూపీఎస్
బి.రాఘవరెడ్డి	ఆర్‌ఎస్‌టీఎఫ్, అన్నమయ్య	వోయాలపాడు సర్కిల్
బి.లక్ష్మన్న	మొలకల చెరువు సర్కిల్	కలకాడ సర్కిల్
సి.వెంకటేశ్వర్లు	వీఆర్, తిరుపతి	మొలకలచెరువు సర్కిల్
పి.చంద్రశేఖర్	వీఆర్, అన్నమయ్య	ఆర్‌ఎస్‌టీఎఫ్, అన్నమయ్య
జి.జీవన్ గంగనాథ్‌బాబు	బి.కొత్తకోట యూపీఎస్	వీఆర్, నంద్యాల
కె.గోపాల్ రెడ్డి	వీఆర్, కడప	బి.కొత్తకోట యూపీఎస్
కే.రాజారెడ్డి	ఎస్‌బీ-3 అన్నమయ్య	మదనపల్లి టూటౌన్ యూపీఎస్
కె.రామచంద్ర	మదనపల్లి టూటౌన్ యూపీఎస్	ఆర్‌ఎస్‌ఏఎస్‌టీఎఫ్, అన్నమయ్య
ఎం.తిమ్మారెడ్డి	వీఆర్, అన్నమయ్య	ఎస్‌బీ-3 అన్నమయ్య
ఎ.మోహన్ కుమార్	డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య	వీఆర్, అన్నమయ్య
ఎస్.గురునాథ్	వీఆర్, కడప	డబ్ల్యూపీఎస్-2 అన్నమయ్య

స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అరుదైన శస్త్రచికిత్సలు


రోగులతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ వైద్యులు, సిబ్బంది

- తొలిసారిగా ప్రాంక్రియాస్ సర్జరీ విజయవంతం

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో సర్జికల్ అంకాలజి వైద్య నిపుణులు రెండు అరుదైన ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు. మొట్టమొదటిసారిగా ప్రాంక్రియాస్ క్యాన్సర్ సర్జరీని చేశారు. ఓర్వకల్లు మండలానికి చెందిన 57ఏళ్ల వ్యక్తికి సర్జికల్ అంకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ చైతన్యవాణి అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.భీసన్న మత్తుమందు వైద్యులు డా.భారతి, డా.సంధ్య, డా.జ్యోత్స్నలు జూలై 18న సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ఈ విషయాన్ని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్ ద్వారా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు తెలిపారు. కడప జిల్లా కాసియాన మండలానికి చెందిన 74 ఏళ్ల వృద్ధుడు మలద్వార క్యాన్సర్‌తో బాధపడుతూ జూలై 21న అడ్మిషన్ పొందారు. ఆపరేషన్‌ను జూలై 24న సర్జికల్ అంకాల జిస్టులు డా.చైతన్యవాణి, డా.బీసన్న, అనస్థీషియా వైద్యులు డా.భారతి, కాంచన, మాలిక్ ల్యాప్రోస్కోపిక్ ద్వారా అబ్డామినో పెరినియల్ రిసెక్షన్ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈరెండు కేసులు ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉచితంగా నిర్వహించామని స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణప్రకాష్ తెలిపారు. ప్లాస్టిక్ సర్జరీ ప్రొఫెసర్ డా.పీఎస్ రాజా రవికుమార్, సర్జికల్ అంకాలజి అసోసియేట్ ప్రొఫెసర్ డా.నరేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సంపత్‌రెడ్డి, పెథాలజి ప్రొఫెసర్ డా.వరలక్ష్మి, నర్సింగ్ సూపరింటెండెంట్ అనసూయ పాల్గొన్నారు.

'హజ్ యాత్రికులకు రూ.లక్ష చొప్పున సాయం'

కర్నూలు అర్బన్, జూలై 6(ఆంధ్రజ్యోతి): హజ్ 2025కు విజయవాడ కేంద్రం ద్వారా వెళ్లే యాత్రికులకు ప్రతి ఒక్కరికి రూ.లక్ష సహాయం ప్రభుత్వం అందిస్తోందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సూరి మన్సూర్ ఆలీఖాన్ తెలిపారు. బుధవారం నగరంలోని మంత్రి టీజీ భరత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన నేపథంలో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం ఎన్నుకున్న 72మంది యాత్రికులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఇచ్చి హామీ మేరకు రూ. 72 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంగళ వారం మంజూరు చేసిందని తెలిపారు. సహకరించిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, టీజీ భరత్, హజ్ కమిటీ ఛైర్మన్ హసన్ భాషా లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. హజ్ యాత్రకు వెళ్లే వారు ఈనెల 7 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వాహనం బోల్తా.. 15 మందికి గాయాలు

వెల్దుర్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని జాతీయ రహదారి-44పై ట్రాలీ వాహనం టైరు పేలడంతో బోల్తాపడి 15మంది గాయ పడ్డారు. వివరాల మేరకు.. బేతంచెర్ల మండలం రుద్రవరం గ్రామస్థులు నంద్యాల జిల్లా డోన్ సమీపంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ కుమారుడి రిసెప్షన్‌కు వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వెళుతున్న క్రమంలో వెల్దుర్తి సమీపాన టైరుపేలింది. వాహనంలో ప్రయాణిస్తున్న 15 మందికి వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందజేశారు. తీవ్రంగా గాయపడిన 5 మందిని మెరుగైన చికిత్స కోసం కర్నూలు సర్వజనవైద్యశాలకు తరలించారు. అదే సమయంలో కర్నూలుకు వెళుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి తన వాహనాన్ని ఆపి, అంబులెన్స్‌కు ఫోన్‌చేసి క్షతగాత్రులకు సాయం చేశారు.

బుగ్గన కుమారుడి రిసెప్షన్‌కు వైఎస్ జగన్

- వాహనాలను నిలిపివేసిన పోలీసులు
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు, ప్రయాణికులు

డోన్ రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని దత్తాత్రేయస్వామి ఆలయ వెనుక ప్రాంతంలో మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడి బుగ్గన అర్జున్ అమర్నాథ్ రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా హెలిప్యాడ్ నుంచి రిసెప్షన్ వేదికకు ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. అభిమానులు ఆయనకు కరచాలనం చేసే ప్రయత్నంలో తోపులాట జరిగింది. వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం తాడేపల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా డోన్‌కు షెడ్యూల్ ప్రకారం రూ.11.45 గంటలకు చేరుకున్నారు. వివాహ రిసెప్షన్ వేదికలో నూతన వధూవరులను ఆశీర్వదించి 12.30 గంటలోపు తిరిగి హెలికాప్టర్‌లో బెంగళూరుకు తిరుగు పయనమయ్యారు.

ఇబ్బందులు పడ్డ వాహనదారులు: డోన్ పట్టణ సమీపంలోని 44వ నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న దత్తాత్రేయ స్వామి గుడి సమీప ప్రాంతంలో సుమారు 20 నిమిషాల పాటు వాహనాలను నిలిపివేశారు. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పర్యవేక్షణలో డోన్ పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, సీఎం రాకేష్‌బాబు, పోలీసు సిబ్బందితో పాటు వివిధ ప్రాంతాల నుంచి పోలీసు అధికారులు మొత్తం 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.


నూతన వధూవరులతో మాజీ సీఎం వైఎస్ జగన్

అభిమానుల అత్యుత్సాహం

డోన్‌కు మాజీ సీఎం జగన్ రాక సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ యువ అభిమానులు తగ్గేదెలే.. అంటూ వైఎస్ జగన్ ఫొటోతో ఉన్న ప్లకార్డులను ప్రదర్శిస్తూ బైకుల మీద హెలిప్యాడ్ ప్రధాన రోడ్డు ప్రాంతంలో కొద్దిసేపు హల్‌చల్ చేశారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ అంటూ ప్రవేశ పెట్టిన రేషన్ వాహనాన్ని పార్టీ అభిమాని వైఎస్ జగన్ బొమ్మ ఉన్న అప్పటి రేషన్ వాహనంతో రోడ్డుపై చక్కర్లు కొట్టారు.

మార్కెట్ యార్డుపై చిన్నచూపు

- మురుగుతో ఇబ్బందులు
- రోగాల బారిన రైతులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేఎంసీ అధికారులు

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డుపై కేఎంసీ అధికారులు చిన్న చూపు చూస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా మార్కెట్ యార్డు డ్రైనేజీ నీళ్లతో మునిగిపోతోంది. సుదూర ప్రాంతాల నుంచి పంట ఉత్పత్తులను విక్రయానికి తెస్తున్న రైతులు రోగాల బారిన పడుతున్నారు. సంవత్సరాల తరబడి ఈ తీవ్రమైన సమస్యను పరిష్కరించాలని కర్నూలు మార్కెట్ యార్డు అధికారులు ఎంతగా ప్రయత్నాలు చేస్తున్నా కేఎంసీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏ మాత్రం కొలిక్కి రావడం లేదు. ఏడాది పొడవునా వేలాది మంది రైతులు పంట ఉత్పత్తులను, కూరగాయలను అమ్ముకునేందుకు మార్కెట్ యార్డుకు తరలివస్తున్నారు. మార్కెట్ సమీపంలోని ఎస్ఏపీ క్యాంపు, సీతారామ్‌నగర్, ఇందిరానగర్ తదితర కాలనీల నుంచి మురికినీటి ప్రవాహం కర్నూలు యార్డులోకి వెల్లువలా వచ్చి పడుతుంది. కాలువలు శిథిలం కావడంతో పాటు వర్షాకాలంలో పెద్ద ఎత్తున నీటి ప్రవాహం పెరిగిపోయి కాలువల నుంచి మురుగు బయటకు వస్తుంది. పక్కనే ఉన్న ప్లాట్‌ఫారాలపై పడుకునే రైతులు దోమకాటుకు గురై రోగాల బారిన పడాల్సి వస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో మున్సిపల్ అధికారులు, మేయర్ బీవై రామయ్యతో కలిసి మార్కెట్ యార్డు అధికారుల వినతి మేరకు స్వయంగా మురుగు ప్రవాహాన్ని పరిశీలించారు. వెంటనే ఈ కాలువను పూడ్చివేస్తామని అధికారులకు హామీ ఇచ్చారు. ఇప్పటిదాకా ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి మార్కెట్‌యార్డు గుండా నిర్మించిన డ్రైనేజీలను తొలగించి యార్డు సమీప కాలనీల నుంచి ప్రవహించే మురుగు ఇతర ప్రదేశాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులు, మార్కెట్ యార్డు అధికారులు కోరుతున్నారు.


మార్కెట్ యార్డు సమీపంలో ప్రవహిస్తున్న మురుగు

మార్కెట్ యార్డు గుండా కేఎంసీ..



గతంలో ఎప్పుడో మార్కెట్ యార్డు సమీప కాలనీల నుంచి వచ్చే నీటిని హంద్రీనదిలో కలిపేందుకు మార్కెట్‌యార్డు గుండా కేఎంసీ అధికారులు కాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువ శిథిలావస్థకు చేరి రైతులకు, యార్డులో పని చేసే కార్మికులకు, సిబ్బం దికి పూర్తిగా సమస్యలు ఎదురవుతున్నాయి.సమస్యను మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– జయలక్ష్మి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ

దోమలతో క్షణం కూడా ఉండలేం..



అనంతపురం జిల్లా ఉరవకొండ నుంచి వేరుశనగ కాయలను అమ్మకానికి కర్నూలు యార్డుకు తీసుకువచ్చా. మురుగునీటి కారణంగా దోమలతో క్షణం కూడా యార్డులో ఉండలేని పరిస్థితి. అమ్మకం ఎప్పుడు పూర్తవుతుందోనని వేచి చూస్తున్నా.

– మారెన్న, రైతు, ఉరవకొండ

ఇంటి పట్టాలు ఇవ్వాలి: సీపీఎం



రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బాలగంగాధర్ తిలక్ నగర్ ప్రజలకు ఇంటి పట్టాలని ఇవ్వాలని కోరుతూ కొత్తబస్టాండు ఎదురుగా రాస్తారోకో చేపట్టారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రాస్తారోకోలో న్యూసిటీ కార్యదర్శి టి.రాముడు మాట్లాడుతూ 42వ వార్డు తిలక్ నగర్‌లో ప్రజలు గత 50 సంవత్సరాల నుంచి గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. వారికి జీవో నెంబరు 30 ప్రకారం రెగ్యులరైజ్ చేస్తూ ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సి.గురుశేఖర్, వై.నగేష్, నగర కార్యదర్శివర్గసభ్యులు సీహెచ్. సాయిబాబా, కే.సుధాకరప్ప, కిరణ్మయి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి: ట్రాఫిక్ సీఐ


వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు క్రైం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. బుధవారం సాయంత్రం కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ తదితర కూడళ్లలో వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు, లైసెన్సులు లేని వాహనాలకు జరిమానా విధించారు. ఈసందర్భంగా మన్సూరుద్దీన్ మాట్లాడుతూ అతి వేగంతోపాటు హెల్మెట్ ధరించకపోవడం వల్లనే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గురువారం నుంచి ప్రతి ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. బుధవారం ఒక్కరోజే హెల్మెట్ ధరించని 100 మంది ద్విచక్ర వాహన దారులకు జరిమానా విధించామన్నారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు


ఇసుకను పరిశీలిస్తున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లుకు కర్నూలు ఇసుక పాయింట్ నుంచి కొందరు వ్యక్తులు అక్రమంగా ఇసుకను తరలి స్తున్నారని, వారిపై చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ విద్యాసాగర్ హెచ్చరించారు. బుధవారం ఓర్వకల్లులో అక్రమ నిల్వ ఉంచిన ఇసుకను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ కర్నూలు ఇసుక పాయింట్ నుంచి టిప్పర్లతో అక్రమంగా ఇసుకను తరలి స్తున్నారని, ఆ వ్యక్తుల పేర్లు, టిప్పర్ల నెంబర్లు తమ వద్ద ఉన్నాయని, అవి దొరికితే వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. వీఆర్వో సోమన్న ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో కరెంటు సరఫరాలో నేడు అంతరాయం ఉంటుందని ఏడీఈ నాగప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సర ఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. బుధవారపేట, చాణక్యపురి కాలనీ, కమ్మవీధి, త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియా, మిల్క్‌డెయిరీ ఏరియాల్లో కరెంట్ ఉండదని, ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

పరుగు పందెంలో బంగారు పతకం

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని అక్షర విద్యాలయంలో నిర్వహించిన సీబీఎస్ఈ క్లస్టర్-7 (2025-26) అథ్లెటిక్ 3వేల పరుగు పందెంలో అథేనా పాఠశాల విద్యార్థి కే.మనీష్ అశ్విన్ కుమార్ బంగారు పతకం సాధిం చాడు. జాతీయ స్థాయి సీబీఎస్ఈ అథ్లెట్ మీట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జ్యోతి తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు అనూప్, ఐశ్వర్యరెడ్డి విజేతను అభినందించారు.

నేడు జిల్లా స్థాయి జంప్ రోప్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి జంప్ రోప్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి బి.జోసెఫ్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 7వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరు కావాలని, వివరాలకు 8790708391 నంబరును సంప్రదించా లని సూచించారు.

9 నుంచి రాష్ట్ర స్థాయి అథ్లెట్స్ ఎంపిక : బాపట్ల జిల్లా చీరాలలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో రాష్ట్ర స్థాయి అథ్లెట్స్ ఎంపిక పోటీలు జరుగుతాయి. జిల్లా స్థాయిలో విజేతలైన 14, 16, 18, 20 విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు గెలిచిన బాలబాలికలు స్థానిక రైల్వేస్టేషన్‌లో 7వ తేదీ రాత్రి 9.30 గంటలకు రైల్వేస్టేషన్‌లో రిపోర్టు చేయాలని ఇన్‌చార్జి సెక్రటరీ లక్ష్మయ్య బుధవారం తెలి పారు. ఎంపికైన విద్యార్థులు పుట్టినరోజు, స్టడి సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. వీరికి టీం మేనేజర్‌గా బాలికలకు నీరజ, హేమ చంద్రిక, బాలురకు మల్లేష్, బిల్లా శ్రీనివాసులు, కాశీరావులు వ్యవహరిస్తారు.

మహాసభలను జయప్రదం చేయాలి: సీపీఐ


మాట్లాడుతున్న రామచంద్రయ్య

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9, 10, 11 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం సీఆర్ భవన్‌లో నగర కార్యవర్గసభ్యులు, శాఖ కార్యాదర్శులు, ప్రజా సంఘాల నాయకుల సమావేశం నగర సహాయ కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. రామచంద్రయ్య మాట్లాడుతూ సీపీఐ వందేళ్ల చరిత్రలో అనేక కేసులను ఎదుర్కొని భూమి, భుక్తి కోసం అనేక పోరా టాలు చేసి విజయాలు సాధించిందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, కార్యవర్గసభ్యుడు కె.జగన్నా థం, నాయకులు రామకృష్ణారెడ్డి, భీమలింగప్ప పాల్గొన్నారు.

నేడు సాయిబాబా ఆలయంలో 'పసుపు-పారాణి'

కర్నూలు కల్చరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): శ్రావణ రెండో గురువారం పురస్కరించుకొని పాతనగరంలోని దక్షిణ షిరిడీ సాయి బాబా దేవస్థానంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 వరకు ముత్తైదువులకు 'పసుపు- పారాణి' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దేవస్థానం కోశాధికారి ఎస్‌జీ మహాబ లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మాతృమూర్తులను లక్ష్మీ స్వరూపంగా భావించి పసుపు, కుంకుమ, ఫల, తాంబూలం, గాజులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.

సమయపాలన పాటించాలి: ఎంపీడీవో

సి.బెళగల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ మండల కేంద్రంలోని 1, 2, 3 సచివాలయాలకు కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చే ప్రజలపై సిబ్బంది దురుసుగా మాట్లాడుతున్నారన్నారు. అలాగే విధులకు వారి ఇష్టం వచ్చిన సమయానికి వచ్చి వెళ్తున్నారని గ్రామస్థులు తమ దృష్టికి తెచ్చారన్నారు. సచివాలయ సిబ్బంది పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, చేనేత కుల సంఘాల సమాఖ్య కర్నూలు యూనిట్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 11 గంటలకు కలె క్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం 11.30 గంటలకు చేనేత జౌళిశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో చేనేత సమస్యలపై చర్చించిస్తామన్నారు. అనంతరం మంత్రి టీజీ భరత్‌కు, జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందిస్తామని తెలిపారు.

'సర్వేపల్లి' విద్యార్థులకు పతకాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ఇటీవల జరిగిన 19వ రాష్ట్ర స్థాయి ఫ్లోర్‌బాల్ పోటీల్లో సర్వేపల్లి పాఠశాల విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ తెలిపారు. అండర్-14 బాలుర విభాగంలో మూడో స్థానం కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందదర్భంగా పాఠశాల కరస్పాం డెంట్ పీ.కేశన్న, ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుతో అధిక లాభాలు

సి.బెళగల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పండ్లతోటల సాగుతో అధిక లాభాలు ఆర్జివచ్చునని కోడుమూరు ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. బుధవారం మండలంలోని మారందొడ్డి గ్రామంలోని పండ్లతోటలను ఆయన పరిశీలించారు. ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ మామిడి, దానిమ్మ, బొప్పాయి, జామ, కొబ్బరి, మునగ తోటలను సాగు చేసుకునేందుకు సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకో వాలన్నారు. అలాగే ఆయిల్‌పామ్‌ను సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం రూ.10వేల సబ్సిడీ అందజేస్తుందన్నారు. ఎంపీఈవోలు చెంచురాజు, భాస్కర్, రైతులు ఉన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో భూపతిరావు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జాతీయ స్పోర్ట్స్ డే సందర్భంగా స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో బుధవారం జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలను డీఎస్‌డీవో భూపతిరావు ప్రారంభించారు. ఈపోటీల్లో జిల్లా నలుమూ లల నుంచి వంద మంది బాలబాలికలు పాల్గొన్నారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ శిక్షకుడు యూసుఫ్, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

తల్లి పాలు అమృతంతో సమానం

ఓర్వకల్లు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని నన్నూరు క్లస్టర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీనా అన్నారు. బుధవారం మండలంలోని నన్నూరు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జరీనా మాట్లాడుతూ తల్లి పాలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలు తాపించాలన్నారు. బిడ్డకు పాలివ్వడం వలన తల్లికి రొమ్ము క్యాన్సర్ రాకుండా నివారించవచ్చన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హుశేనాపురం సూపర్‌వైజర్ నాగలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఎస్ర్టిరి, ఏఎన్ఎం శ్రీలత, ఎంఎల్‌ఆర్‌పీ సంధ్యారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

కర్నూలు హాస్పిటల్: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలో జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డైస్)లో రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారో త్సవాలను నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి పాలు తాపాలని,


పోలకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్, అంగన్‌వాడీలు


నన్నూరులో మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జరీనా


మాట్లాడుతున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ మహేశ్వర ప్రసాద్

పుట్టగానే చక్కెరనీళ్లు, తేనే తాగించకూడదని అన్నారు. బిడ్డకు రావాల్సిన పోషకాలు ముర్రుపాలలో ఉంటాయన్నారు. కార్యక మంలో డైస్ డాక్టర్ సృజన, మేనేజర్ ఇర్ఫాన్, ప్రొజెక్టనిస్టు ఖలీల్, స్టాఫ్ నర్సులు సరిత, మాలతి, సోషల్ వర్కర్, యశోధ, డైస్ సిబ్బంది ఉన్నారు.

సి.బెళగల్: తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యమని సి.బెళగల్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మల్లేశ్వరమ్మ అన్నారు. బుధవారం మండలంలోని పోలకల్లు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గులాబీ పురుగు నివారణకు చర్యలు తీసుకోండి


'పొలం పిలుస్తోంది'లో పాల్గొన్న వ్యవసాయాధికారి

కోడుమూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పత్తిలో గులాబీ పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారి రవిప్రకాష్‌గౌడ్ రైతులకు సూచించారు. బుధవారం అమడగుంట్లలో పొలం పిలుస్తోందిలో భాగంగా ఆయన రైతులకు పలు సూచనలిచ్చారు. గడ్డిపూలను గట్టున కాల్చివేయాలని, ఎకరాకు ఫ్లూబెండమైడ్ 80 ఎంఎల్ లేదా క్లోరంత్ర నిల్ ప్రోల్ 100 ఎంఎల్ పిచికారి చేయాలని సూచించారు. ఎకరాకు 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకో వాలన్నారు. అలాగే దోమ నివారణకు జిగురు అట్టలు ఉంచాలన్నారు. అనుగొండలో ఏఈవో బాలక్రిష్ణ పొలం బడి నిర్వహించారు.

రేపు సామూహిక వరలక్ష్మి వ్రతం

గూడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పీఎస్ రాధాకృష్ణ తెలిపారు. బుధ వారం సుంకులా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాట్లను ఈవో పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో నిర్వహించే సామూహిక వరలక్ష్మీ వ్రతంలో భక్తులు పాల్గొన్నాలన్నారు. ఈకార్యక్రమానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, పూజా సామగ్రి దేవస్థానం వారే ఇస్తార న్నారు. అదేవిధంగా గూడూరులోని సంతాన నాగదేవతా ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతం, శనివారం అమ్మవారికి అభిషే కాలు, అర్చనలతోపాటు అన్నదానం నిర్వహిస్తామని, సాయంత్రం ప్రభో త్సవం ఉంటుందని భక్త బృందం తెలిపారు.

'మైఫర్'లో క్యాంపస్ డ్రైవ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏ.క్యాంపులోని మైఫర్ ఫార్మసీ కళాశాలలో బుధవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఇండియన్ ఇమ్యూనాలజీకల్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాతపరీక్షలు, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారు. కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ రాతపరీక్షలు, ఇంటర్వ్యూలకు 150 మంది పాల్గొనగా.. అందులో 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వారికి ఆఫర్ లెటర్ అందజేశామని అన్నారు. ప్రిన్సిపాల్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాసర్ల సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్, ప్లేస్‌మెంటు ఆఫీసర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె కృష్ణమ్మను అరెస్టు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకురాలు గుడిసె కిష్టమ్మ, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం దళిత, గిరిజన, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు దేవదాసు అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆనంద్‌బాబు మాట్లాడుతూ జూన్ 16న డానాపురం గ్రామంలో ఎమ్మెల్యే పార్థసారథి, గుడిసె కిష్టమ్మ అంటరానితనాన్ని పాటించి రాష్ట్ర పరువును మంట గలిపారన్నారు. ఘటన జరిగి రెండు నెలలు కావస్తు న్నా అధికారులు, ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా లేదన్నారు. గిరిజన సంఘం గౌరవ అధ్యక్షుడు రాముడు, డీహె చ్‌పీఎస్ జిల్లా సహాయ కార్య దర్శి వీరేష్, న్యాయవాది కిరణ్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.


ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై కొరడా

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్


మాట్లాడుతున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై కొరఢా ఝుళిపించాలని, పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులు నిర్లక్ష్యం వీడి క్షేత్రస్థాయిలో పర్యటించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని సమావేశ భవనంలో పట్టణ ప్రణాళిక అధికారులు, ప్లానింగ్ సెక్రటరీలతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మునుపటిలా పని చేస్తామంటే కుదరదు, ఖచ్చితంగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణలను తొలగించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. భవన నిర్మాణ వ్యర్థాల సేకరణకు నూతనంగా తీసుకువచ్చిన విధానాన్ని ప్రజల్లో ప్రచారం చేయాలని అన్నారు. సీఅండ్‌డీ వ్యర్థా సేకరణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక నెంబర్లు 08518-221847, 9100030250 ప్రచారం కల్పించాలన్నారు. సమావేశంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్ బాషా, సూపరింటెండెంటు సుబ్బన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయాలి

సి.బెళగల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ బూత్ కమిటీల అధ్యక్షులంతా బాధ్యతగా పనిచేసి, మండలంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని పార్టీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, రాముడు, లింగన్న, సోమన్న, వెంకటరాముడు, బాషా, రాంభూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భాస్కర రెడ్డి కుటుంబానికి కోట్ల పరామర్శ


భాస్కర రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

గూడూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ మాజీ అధ్యక్షుడు ఆర్ భాస్కర రెడ్డి సోదరుడు ఆర్ మాధవ రెడ్డి గుండెపోటుతో మృతి చెందగా విషయం తెలుసుకున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గుడిపాడులో భాస్కర రెడ్డి కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. కట్ల మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలకు తాము అండగా ఉంటామన్నారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ ఎల్ సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకుడు ఆర్ చంద్రారెడ్డి, కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్, సలీం, సంఘాల మధు, చెట్టుకింది నారాయణ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గస భ్యుడు జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య భవన్‌లో కర్నూలు మండల కమిటీ సమావేశం సీపీఎం మండల నాయకుడు రాఘవేంద్ర అధ్యక్షతన జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ ఈ.తాండ్ర పాడు గ్రామంలో వరదల కారణంగా పునరావాసం కింద 70 ఎకరాల్లో 1500 మందికి పట్టాలు ఇచ్చారని, నేటికి స్థలాలు చూపించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గొందిపర్ల, పసుపల, గార్గేయపురం, అంబేద్కర్ నగర్ గ్రామాలలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రోడ్లు, డ్రైనేజీ లేని గ్రామాలలో వసతులు కల్పించాలన్నారు. సమావేశంలో ఈ.తాండ్రపాడు సర్పంచు బాలపీరా, నాయకులు శ్రీరాములు, నరసింహ పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ వెనుక చెత్త

తొలగించని సిబ్బంది

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పరిపాలన భవనం వెనుక వైపు చెత్తాచెదారంతో నిండుకుని ఉంది. దీనిని తొలగించేందుకు సిబ్బంది ముందుకు రావడం లేదు. చెత్తాచెదారంతో పాటు గడ్డి కూడా ఏపుగా పెరగడంతో అందులోనుంచి విషపురుగులు వస్తున్నాయని ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా డీపీఆర్‌సీ భవనం పక్కనే కొందరు నిరుద్యోగులు వివిధ రకాల ఉద్యోగాల కోసం నిత్యం చదువుకుంటూ ఉంటారు. ఈ క్రమంలో ఇటీవల కొందరికి ఏపుగా పెరిగిన గడ్డిలో నుంచి పాములు వస్తున్నట్లు కనిపించినట్లు చెప్పారు. అధికారులు స్పందించి పెరిగిన గడ్డిని... చెత్తాచె దారాన్ని తొలగించాలని ఉద్యోగులు కోరుతున్నారు.


జిల్లా పరిషత్ వెనుక వైపు వేసిన చెత్త, ఏపుగా పెరిగిన గడ్డి

ఇళ్ల స్థలాలకు 300 దరఖాస్తులు

మద్దికెర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల స్థలాల కోసం 300 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ గుండాల్ నాయక్ తెలిపారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడుతూ 11 గ్రామాల ప్రజలు సచివాలయాల్లో దరఖాస్తు చేశారని, వారికి స్థలాలు ఇచ్చేందుకుక ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకుని లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని మద్దికెరలో 13 ఎకరాలు, ఎం.అగ్రహారంలో ఐదెకరాలు స్థలం ఉందని, అర్హులకు స్థలాలు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వీఆర్వో రంగస్వామి తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

● కాంట్రాక్టర్, ఏఈతో మాట్లాడిన టీడీపీ నాయకులు



పిల్లర్లను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

హొళగుంద, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయం ఆవరణలో గదుల నిర్మాణ పనుల్లో నాణత్య పాటించాలని టీడీపీ మండల్ కన్వీనర్ వీరన్న గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 4వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'నాణ్యత నగుబాటు' శీర్షికన ప్రచురితమైన కథనానికి నాయకులు స్పందించారు. పనులు నాణ్యంగా చేయాలని కాంట్రాక్టర్, ఎస్ఎస్ఏఏఈ ఖాజా మొహిద్దీన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎస్ఎస్ఏ నిధులు రూ. 1.30 కోట్లతో మూడు డార్మెంటరీ గదులు, మూడు రెసిడెన్సియల్ గదులకు టీడీపీ ప్రభుత్వం కృషిచేసుతంటే అడుగులోపే పునాదులు వేయడం వేయడం సరికాదన్నారు. నాయకులు జాంబాపురం బసవ, జాకీర్, మొయిన్, హాస్సేన్ పీరా, భాస్కర్ పాల్గొన్నారు.

మా పొలాల్లో దారి ఎలా వేస్తారు?



రికార్డులను పరిశీలిస్తున్న వీఆర్వో

మద్దికెర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంత పురంలో ప్లాట్లు వేసుకున్న రియల్టర్లు తమ పొలాల్లో దారి ఎలా నిర్మిస్తారని కాలనీవాసులు ప్రసాద్, హనుమంతు ప్రశ్నించారు. బుధవారం గ్రామానికి స్థల పరిశీలనకు వచ్చిన రెవెన్యూ అధికా రులు, వీఆర్వో తిమ్మప్ప, సర్వేయర్లను కాలనీవాసులు అడ్డుకున్నారు. స్థానికులు అడ్డుకోవడంతో రెవెన్యూ అధికారులు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

ఆక్రమణలను కూల్చేస్తాం

● పంచాయతీ ఈవో నరసింహులు

పత్తికొండ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీలో రహదారులను ఆక్రమించిన నిర్మిస్తే కూల్చి వేస్తామని ఈవో నరసింహులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మడ్డిగేరిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈవో, సిబ్బంది పర్యటించారు. కాలనీల్లో ఇప్పటికే రోడ్లు ఇరుకుగా ఉన్నాయని, ఇరుకు రహదారుల్లోనే గృహాలను నిర్మిస్తే రాకపోకలు ఎలా సాగిస్తారన్నారు. తక్షణమే ఆక్రమణలను తొలగించుకోవాలని, లేకపోతే పంచాయతీ సిబ్బంది ఆధ్వర్యంలో కూల్చి వేస్తామన్నారు. సిబ్బంది, వార్డు మెంబర్ పాల్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.



నిర్మాణదారులను హెచ్చరిస్తున్న ఈవో నరసింహులు

ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు



హంద్రీ వద్ద గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంవీఐ

దేవనకొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని ఎంవీఐ ఎం.శిశిర దీప్తి హెచ్చరించారు. మండలంలోని తెర్నేకల్లు హంద్రీ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం అమె హంద్రీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు. అనుమతి లేని వాహనాలు హంద్రీలోకి వస్తే చర్యలు తీసుకుంటామని ట్రాక్టరు యజమానులను హెచ్చరించారు. డీటీ అమీనబేగం, ఆర్ఐ లవిజయబాస్కర్, సర్పంచు అరుణ్ కుమార్, తదితరులు ఉన్నారు.

బాధితుల కోసం హెల్ప్‌డెస్క్



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లోకేశ్వరి

ఆదోని టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరద బాధితుల కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి తెలిపారు. బాధితులు సెల్ 7032575929 నెంబర్‌కు ఫోన్ చేస్తే సాయం అందుతుందన్నారు. పట్టణం నడిబొడ్డు నుంచి వెళ్తున్న హొదోడి వంక, పెద్ద కాలువలో తొలగిస్తున్న పూడిక వనులను బుధవారం పరిశీలించారు. వారం రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారు హెచ్చరికల నేపథ్యంలో సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. నష్టపోయిన పేదలకు ప్రభుత్వం నుంచి సాయం అందించాలని సబ్ కలెక్టర్‌ను కోరామని తెలిపారు. రాత్రి వర్షం కురిస్తే ప్రభుత్వ పాఠశాలలో శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు.

నరకదారులు



బురదతో నిండిన నాగరకన్వి రోడ్డు



హన్నూరు గ్రామ రహదారి దుస్థితి

హొళగుంద, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగరకన్వి గ్రామానికి వెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నల్లరేగడి మట్టి రోడ్డు ఉండటంతో వర్షం కురిసిందంటే చాలు వాహనాలు బురదలో ఇరుక్కుపోతున్నాయి. మండల కేంద్రం నుంచి మార్లమడికి 5 కి.మీ.లు తారు రోడ్డు ఉండగా, మార్లమిడి నుంచి నాగరకన్వికి మూడు కి.మీ.ల దారి మట్టిరోడ్డు ఉంది. అలాగే నాగరకన్వి నుంచి హన్నూరుకు రెండు కి.మీ.లు మట్టి రోడ్డు కావడంతో చినుకు పడితే బురదమయంగా మారి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

తడబడి



బురదలో ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

హాలహర్వి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే దారి మొత్తం బురదమయంగా మారడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో 250మంది విద్యార్థులు చదువుతున్నారు. బరదలోనే నడుచుకుంటూ వెళ్లాలని, అదుపు తప్పి కిందపడే ప్రమాదముందని నూతన రహదారి నిర్మించాలని కోరుతున్నారు.

ముందస్తు చర్యలు తీసుకోకపోతే ఎలా?

● అధికారులపై ఎమ్మెల్యే డా.పార్థసారథి ఆగ్రహం



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులు

ఆదోని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ముందు జాగ్రత్తలు ఎందుకు తీసుకోలేదని అధికారులపై ఎమ్మెల్యే డా. పార్థసారథి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. మంగళవారం ఆదోనిలో కురిసిన భారీ వర్షంతో కాలువలు ఉప్పొంగాయి. దీంతో ఆ ప్రాంతాలను ఎమ్మెల్యే మున్సిపల్ అధికారుతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, చాలా కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరిందన్నారు. వర్షపు నీటిని తొలగించేందుకు కార్మికులను సిద్ధంగా ఉంచారని వరద బాధితులు టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇల్లు కూలిపోయిన వారికి హౌసింగ్ అధికారులతో మాట్లాడి నూతన గృహం నిర్మిస్తామన్నారు. ఆదోని పాత ఓవర్ బ్రిడ్జిపై గుంతలు పడ్డాయని, రెయిలింగ్ కూలిపోయే స్థితిలో ఉందని, నూతన వంతెన నిర్మాణానిరి రూ.86 కోట్లు అవసరమవుతాయన్నారు. కేంద్ర మంత్రులతో మాట్లాడి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆదోనిలో కొత్తగా నిర్మిస్తున్న బైపాస్ పూర్తయితే వాహనాల రాకపోకలను అటువైపు మళ్లించి, నూతన వెంతన నిర్మాణానికి అనుకూలంగా ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ, డీఈలు రామ్మూర్తి, గోపీనా, ఆర్అండ్‌బీ ఎస్‌హెచ్ అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చేందుకే అన్న క్యాంటీన్



స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): కర్షకులు, పేదల ఆకలి తీర్చేందుకే ఆలూరులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రకాశం పార్కులో స్థలాన్ని పరిశీలించారు. గత ప్రభుత్వం క్యాంటీన్‌లను రద్దు చేసిందని, టీడీపీ రాగానే పునఃరుద్ధరించిందన్నారు. క్యాంటీన్ నిర్మాణానికి సీఎం చంద్రబాబు రూ.45 లక్షలు మంజూరు చేశారని, గురువారం ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి భూమిపూజ చేస్తారన్నారు. పబ్లిక్ హెల్త్ డీఈఈ వెంకటేశ్వర్లు, ఏఈ వినోద్, టీడీపీ నాయకులు నరసప్ప, కొమ్ము రామంజినేయులు, రాజు, గుండన్న, నెట్టప్ప, రాముయాదవ్, బెల్డోణ గోవింద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



ట్రైనర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలతో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ సీట్ ఫౌండేషన్ ట్రైనర్ అనిల్‌రాజ్ కమలాకర్ సూచించారు. బుధవారం ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం ముగిశాయి. సైబర్ నేరగాళ్ల వలలో పడవద్దని, వాట్సప్, ఫేస్‌బుక్, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయెద్దన్నారు. సైబర్ నేరగాళ్లు మోసం చేసినా, బెదిరించినా ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం ఆయనను కళాశాల యాజమాన్యం దైవదీనం రెడ్డి, చైర్మన్ విట్టారమేష్ సన్మానించారు. సభ్యులు సుగురప్ప, సనత్ కుమార్, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వైస్ ప్రిన్సిపాల్ బాలస్వామి, చంద్రశేఖర్, యుగంధర్ రెడ్డి పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనపై అవగాహన

వెల్దుర్తి/డెల్దుర్తి టౌన్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో 'టీబీ ముక్త అభియాన్' వైద్యసిబ్బంది నిర్వహించారు. బుధవారం వైద్యాధికారి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు, బరువు తగ్గిపోతే గళ్ల పరీక్షల, ఎక్స్‌రే తీయించుకోవాలన్నారు. సీహెచ్‌వో మేఘన, ఏఎన్ఎమ్ గోవిందమ్మ, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఆశాలు పాల్గొన్నారు.

తల్లిపాలతో షోషకాహారం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ స్వయంప్రభ

ఆదోని టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలతో షోషకాహారం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వయం ప్రభ అన్నారు. బుధవారం ఖాజీపురాలోని కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బాలింతలు, చంటి పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. బిడ్డకు తరచుగా తల్లిపాలివ్వడంతో సంపూర్ణ ఆరోగ్యం, రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. నాగవేణి శారద, విజయ నిర్మల, గిరిజ, ఈరమ్మ పాల్గొన్నారు.

హాలహర్వి: బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠమని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదం చేస్తాయి. ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. బుధవారం హాలహర్విలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఎంపీడీవో కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహిం చారు. శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలు పట్టించాలన్నారు.

వేగవంతం చేయండి

మద్దికెర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీ-4 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో స్వర్ణలత సూచించారు. బుధవారం మాట్లాడుతూ వ్యాపారులంతా పీ-4లో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ ఐదు కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, కార్యదర్శి శివకుమార్, పరమేశ్వరప్ప, వన్నూరప్ప ఉన్నారు.

రీ సర్వేకు సహకరించాలి

తుగ్గలి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి):;రీ సర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దార్ రవి కోరారు. బుధవారం వీఆర్వోలు, సర్వేయర్లతో మాట్లాడుతూ రైతులు తమ పొలాలకు సర్వే చేయించుకోవాలని, సమస్యలుంటే పరిష్కరించుకోవాలన్నారు.

సారా స్థావరాలపై దాడులు

ఆదోని, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అపిసారాళ్ల కొండల్లో సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా తెలిపారు. వివరాల మేరకు.. నవోదయం 2.0లో భాగంగా ఆదోని ఎక్సైజ్ పోలీస్, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆదోని సివిల్ పోలీసులు సంయుక్తంగా దాడలు నిర్వహించి 250 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 25 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. తయారీ దారుడు వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మురళిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

హాలహర్వి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఆలూరు ఏడీఏ చెంగలరాయుడు హెచ్చరించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ ఫర్టిలైజర్ల డీలర్లు రైతులకు బిల్లులు ఇవ్వాలని, కాగితాలపై రాసి ఇస్తే లైసెన్సులను రద్దు చేస్తామన్నారు.

అందుబాటులో ఎరువులు

ఆలూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఆలూరు ఏవో వెంకటేశ్వరగౌడ్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 18,755 మంది రైతులు అన్నదాత సుఖీభవ కింద లబ్ధి పొందారన్నారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో

వెల్దుర్తి టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొసనాపల్లె గ్రామ సమీపంలో ఆటోను బైక్ ఢీకొన్న ప్రమాదంలంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. బుధవారం కొసనపల్లె గ్రామానికి చెందిన యువకుడు మనోజ్ వెల్దుర్తికి బైక్‌పై వస్తుండగా సుంకులమ్మ గుడి మలుపు వద్ద ఆటోను బైక్ ఢీకొంది. మనోజ్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సార్లు ఎక్కడ?



ఖాళీగా ఉన్న సచివాలయం -4

మద్దికెర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 4వ సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట దాటినా సచివాలయ ఉద్యోగులు, అధికారులు ఎవరూ కనిపించలేదు. రోజూ ఇంతే అని ఎవరూ లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నా మని రైతులు, ప్రజలు వాపోతున్నారు. ఉదయం స్వీపర్లు వచ్చి తలుపు తెరిచి శుభ్రం చేసి వెళ్లిపోతున్నారని తర్వాత ఎవరూ ఉండరని ఆరోపిస్తున్నారు. 1బీ అడంగల్ కోసం వస్తే ప్రింటర్‌య పనిచేయడం లేదు, ఆన్‌లైన్ చేసి వాట్సాప్‌కు పంపిస్తున్నారని నరసన్న, వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ నూతన ప్రింటర్ తెప్పిస్తామని, సచివాలయ ఉద్యోగులు కొంతమంది సర్వేకు వెళ్లారని వివరణ ఇచ్చారు.

వర్షంతో పంటకు ఊపిరి



మండిగిరిలో కళకళలాడుతున్న పత్తి

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా డివిజన్‌లో కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ పంటలకు ఊపిరి పోశాయి 20 రోజులుగా మొఖం చాటేసిన వర్షాలు మంగళవారం కురియడంతో పత్తి, వేరుశనగ అముదం, ఇతర పంటలు కళకళలాడుతున్నాయి ఆదోని, కౌతాళం, కోసిగి, పెద్ద కడుబూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 85,289 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అత్యధికంగా 60,235 హెక్టార్లలో పత్తి పంట సాగు కాగా, వేరుశనగ 12,255తోపాటు మిగతా ఆముదం, మిరప, ఉల్లి, జొన్న, కంది సాగునట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అధికంగా రసాయనిక ఎరువులు వాడొద్దని వ్యవసాయి అధికారుల సూచనలకు మేరకు ఉపయోగించాలని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. వర్షాలు కురడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

14 వరకు ఫసల్ బీమాకు గడువు



మాట్లాడుతున్న ఏవో వెంకటరాముడు

పత్తికొండ టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటల ఫసల్ బీమా గడువు ఈనెల 14వ తేదీ వరకు ఉందని ఏవో వెంకట రాముడు తెలిపారు. బుధవారం దేవనబండ, నలకదొడ్డి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. అనంతరం రైతుసేవా కేంద్రంలో మాట్లాడుతూ చీడపురుగులు, దోమ నివారణకు వ్యవసాయ అధికారుల సూచన మేరకు మందులు పిచికరా చేయాలన్నారు . రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉందని, కావాల్సిన రైతులు యూరియాను పొందవచ్చన్నారు.

హాస్టల్‌లో 'ఫ్రెషర్స్ డే'



మాజీ జడ్పీటీసీని సన్మానిస్తున్న వార్డెన్ గిరిజాదేవి

వెల్దుర్తి, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): బీసీ బాలికల వసతి గృహంలో బుధవారం వార్డెన్ గిరిజాదేవి ఆధ్వర్యంలో 'ఫ్రెషర్స్ డే' నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ జడ్పీటీసీ పుష్పావతి, హెచ్ఎం చంద్రావతి హాజరయ్యారు. హాస్టల్‌లో చేరిన నూతన విద్యార్థినులకు సీనియర్లు స్వాగతం పలికారు. విద్యార్థినుల ఆట, పాటలు ఆకట్టుకున్నాయి.

పత్తికొండ మార్కెట్‌లో వ్యాపారి బూతులు

● దాడికి యత్నించిన వ్యాపారి బంధువు

పత్తికొండ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్‌యార్డులో బుధవారం టమోటా వ్యాపారులు రెచ్చిపోయారు. ఏకంగా రమేష్ అనే వ్యాపారి పలువురిపై దురుసుగా ప్రవర్తించాడు. అక్కడే ఉన్న అతడి అల్లుడు ఏకంగా ఒకరిపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. అక్కడున్న హమాలీలు అడ్డుకున్నారు. ఇక్కడ తప్పించుకున్నా భయట నిన్ను వదిలే ప్రసక్తే లేదు.. తాటతీస్తా అంటూ అతడు రెచ్చిపోయాడు. మార్కెట్‌యార్డు కార్యదర్శికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా మీటింగ్‌నిమిత్తం కర్నూలు వచ్చానని, గురువారం విచారిస్తామని ఆయన సమాధానం ఇచ్చారు.

సొంత నిధులతో..

● పాఠశాలలో షెడ్డు నిర్మించిన విద్యార్థుల తల్లిదండ్రులు



తల్లిదండ్రులు నిర్మించిన షెడ్డు ఇదే




షెడ్డులో కొనసాగుతున్న తరగతులు

ఆలూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హులేబీడు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. రెండు గదులు మాత్రమే ఉండడంతో గదులు సరిపోకపోవడం లేదు. పిల్లల ఇబ్బందులను గమనించిన తల్లిదండ్రులు చేయి చేయి కలిపి రూ.2లక్షలు పోగు చేసుకుని పాఠశాల పక్కనే ఓ షెడ్డును, మూడు గదులు వచ్చేలా నిర్మిం చారు. విద్యాశాఖ అధికారులు కోమలదేవి, చిరంజీవిరెడ్డిలు గదులను పరిశీలించి తల్లిదండ్రులను అభినందించారు. ఈ గదులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి ఫ్యాన్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. దాతలు, పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని హెచ్ఎం వరలక్ష్మి కోరారు.

కర్షకుడికి ఊరట

● 'అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్'తో లబ్ధి
● ఆనందంలో రైతన్నలు





ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రైతన్నలు ప్రతియేటా ఎన్నో ఆశలతో పంటలను సాగు చేస్తారు. అయితే ఏదో ఓ రూపంలో రైతులకు నష్టాలు మాత్రం తప్పడంలేదు. కొంతమంది రైతులు పంటల సాగు కోసం అప్పులు తెచ్చి వాటిని తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. రైతన్నల కష్టాలను దృష్టిలో ఉంచుకొని వారికి పెట్టుబడి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం "అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్" వంటి పథకాలు అమలు చేసింది. ఈ పథకం ద్వారా రైతుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు జమచేసి రైతులకు చేదోడు వాదోడుగా నిలుస్తోంది. దీంతో రైతులు ప్రభుత్వం అందజేసిన డబ్బులను పెట్టుబడులకు ఉపయోగించుకొని ఆర్థిక ఊరట చెందుతున్నారు. ఈ ఏడాది ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో 38,318 మంది రైతులు 1.20లక్షల ఎకరాల్లో రైతన్నలు వివిధ రకాల పంటలను సాగు చేశారు. వీరికి కూటమి ప్రభుత్వం రూ.26.04కోట్లను "అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్" పథకం కింద నిధులను విడుదల చేసింది. దీంతో ఆయా మండలాల్లోని రైతన్నలు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకొని రైతన్నలకు చేదోడు వాదోడుగా నిలిచిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు జమయ్యాయి



నాకు కలుగొట్ల గ్రామంలో ఎకరా పొలం ఉంది. ఈ ఏడాది పత్తిపంటను సాగు చేశాను. అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ డబ్బులను జమ చేస్తారో లేదో అనుకున్నాం. కాని.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నాఖాతాలో రూ.7వేలు జమ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

● కుమ్మరి వెంకటేష్, రైతు, ఎమ్మిగనూరు

మాట తప్పడని తెలుసు



ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఇచ్చిన మాట తప్పడని తెలుసు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ప్రచారంలో ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తూ వస్తోంది. మా పిల్లలకు తల్లికి వందనం డబ్బులు వేశారు. మాకు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసి ఆదుకున్నారు. మరో రెండు విడుతల డబ్బులను కూడా జమచేస్తారనే నమ్మకం ఉంది.

● రామ్మూర్తి పెద్దయ్య, రైతు, కొటేకల్లు

రైతులందరూ ఈకేవైసీ చేయించుకోవాలి



రైతులందరికీ అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ నగదు జమ అవుతుంది. ఇప్పటివరకు దాదాపు 38,318 మంది రైతులకు డబ్బులు జమచేసింది. కొంత మంది రైతులు ఈకేవైసీని చేయించుకోలేదు. దీంతో ఆ రైతులకు డబ్బులు పడిఉండవు. వెంటనే ఈకేవైసీని చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఉంటే తమదృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తాం.

● శివశంకర్, మండల వ్యవసాయ అధికారి, ఎమ్మిగనూరు

చేనేత కార్మికులపై కేంద్రం వివక్ష



మాట్లాడుతున్న చేనేత కార్మిక సంఘం నాయకుడు కాశప్ప

ఎమ్మిగనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్షత ప్రదర్శిస్తోందని ఏపీ చేనేత కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి కాశప్ప అన్నారు. బుధవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో చేనేకార్మిక సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. చేనేతనాయకులు కాశప్ప, సీఐటీయూ నాయకులు రాముడులు మాట్లాడుతూ మూడో సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం చేనేతరంగానికి తగినంత బడ్జెట్ కేటాయించక పోగా ఉన్న పథకాలను రద్దు చేసిందని విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో చేనేతలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవానికి చేనేత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణ, శ్రీనివాసులు, రాజు, లక్ష్మన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

మఠానికి బియ్యం విరాళం

మంత్రాలయం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి కర్ణాటకకు చెందిన భక్తులు 150 క్వింటాళ్ల బియ్యం విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిసురేష్ కోణాపూర్ తెలిపారు. బుధవారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని 150 క్వింటాళ్ల బియ్యం విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. దాతల కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో రవి కులకర్ణి, నారాయణ రావు, నరసింహ దేశాయ్, శ్రీపాద ఆచార్ పాల్గొన్నారు.

టీడీపీతోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి

ఎమ్మిగనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే నాయీ బ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని నాయీ బ్రాహ్మణ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమార్, స్థానిక నాయకులు శీను, బాలు అన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ రాజధానిలో జరిగిన మంత్రి మండలి సమావేశంలో నాయీ బ్రాహ్మణ సెలూన్ షాపులకు ప్రస్తుతం ఇస్తున్న 150యూనిట్ల నుంచి 200 యూనిట్ల విద్యుత్ ఇచ్చేందుకు మంత్రి మండలి ఆమోదం తెలపటం హర్షణీయమన్నారు. గతంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయటం, దేవదాయ శాఖ పాలకమండల్లో సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించటం సంతోషించదగ్గవిషయమన్నారు. నాయీ బ్రాహ్మణుల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణులంతా కూటమి ప్రభుత్వంతోనే కొనసాగుతామన్నారు.

ఎమ్మిగనూరులో 31.6 మి.మీ. వర్షపాతం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): దాదాపు నెల రోజులుగా వర్షాలు లేకపోవడంతో చేతికొచ్చిన పంటలు ఎండుముఖం పట్టాయి. అయితే బుధవారం తెల్లవారుజామున ఎమ్మిగనూరు మండలంలో 31.6 మీ.మీ., వర్షపాతం నమోదైంది. దాంతో రైతన్నల కళ్లల్లో ఆనందం నెలకొంది. చేతికొచ్చిన పంటలు ఎండుముఖం పడుతున్న సమయంలో వరుణదేవుడు కరుణించడంతో రైతన్నలు పంటపొలాల పనుల్లో నిమగ్నమయ్యారు.

జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ఎమ్మిగనూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం నిర్వహిస్తున్న జాతీయ చేనేత దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం 9.30గంటలకు మాచాని సోమప్ప సర్కిల్‌కు చేరుకొని అక్కడ చేనేత పిత పద్మశ్రీ మాచాని సోమప్ప విగ్రహానికి పూలమాల వేసి, ఊరేగింపుగా కుర్నికమ్యూనిటీ హాల్‌కు వెళ్తామన్నారు. చేనేతదినోత్సవ సభ ఉంటుందన్నారు. నియోజవర్గంలోని ఆయా మండలాల్లో ఉన్న చేనేతలు, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు



స్వర్ణ పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్రస్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రావణ ద్వాదశి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి అంగరంగ వైభవంగా ఊరేగించారు. వివిధ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తుల తరలివచ్చారు. స్వర్ణపల్లకి ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు.

నిఘా కట్టుదిట్టం

● డీఎస్పీ భార్గవి ● నాగలదిన్నె చెక్‌పోస్టు తనిఖీ



నాగలదిన్నె చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీఎస్పీ

నందవరం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): చెక్‌పోస్టులో నిఘా కట్టుదిట్టంగా ఉండాలని డీఎస్పీ భార్గవి ఆదేశించారు. బుధవారం మండలంలో ఆంధ్రా- తెలంగాణను అనుసంధానం చేస్తున్న నాగలదిన్నె చెక్ పోస్టు, తుంగభద్ర నది దగ్గర ప్రాంతాన్ని డీఎస్పీ భార్గవి పరిశీలించారు. చెక్‌పోస్టు దగ్గర నుంచి అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు ఏమైనా జరుగుతున్నాయా.. ఏలాంటి చర్యలు తీసుకుంటున్నారని ఎస్ఐ కేశవను అడిగి తెలుసుకున్నారు. సరిహద్దు ప్రాంతంలో ఎలా అప్రమత్తంగా ఉండాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఎస్ఐను ఆదేశించారు. అక్రమ మద్యం రవాణా, బెల్టు షాపులపై కూడా చెక్ పోస్టు దగ్గర నిఘా ఉండాలన్నారు. డీఎస్పీ వెంట పోలీసులు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ, బీసీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో ప్రభుత్వం ఎస్సీ, బీసీ బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు మునిస్వామి డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మునిస్వామి మాట్లాడుతూ కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు ఆటస్థలం లేక ఇబ్బంది పడుతున్నారని, అందుచేత ప్రభుత్వం ఆటస్థలంను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే గోనెగండ్ల బీసీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు సరిపడ గదులు లేక పోవడంతో సమస్యగా ఉందన్నారు. కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, మినరల్ వాటర్‌ప్లాంట్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమీర్, అన్వర్, సరేష్, రామకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు.

12న వాహనం వేలం

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యశాఖ కార్యాలయంలో ఉన్న వాహనాన్ని వేలం వేస్తున్నట్లు గాజులదిన్నె మత్స్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. ఈనెల 12వ తేదీ ఉదయం 11 గంటలకు మత్స్య క్షేత్రం గాజులదిన్నెలో వేలం ఉంటుందన్నారు. ఆసక్తి గత వారు వేలంలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 8309776847 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



ప్రజలకు కరపత్రాన్ని అందిస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టీడీపీ సీనియర్ నాయకులు రంగన్న, బూత్ కన్వీనర్ వాల్మీకి రామనాయుడు అన్నారు. బుధవారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలను వివరించారు. కురువ గోవిందు, తిరుమలనాయుడు, చంద్రన్న, కృష్ణయ్య పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ప్రభుత్వ వైద్యురాలు రంగారవళి, సీడీపీవో స్వప్రనిషాబేగం అన్నారు. బుధవారం గోనెగండ్ల ఐసీడీఎస్ కార్యాలయంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతను గురించి వివరించారు. సూపర్‌వైజర్లు రాధ, సుచరిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పత్తి సాగులో మెలకువలు పాటించాలి: శాస్త్రవేత్త



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పత్తిసాగులో మెలకువలు పాటించి మంచి దిగుబడులు సాధించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుడికల్లు గ్రామంలో ఏవో శివశంకర్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పత్తి పొలాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం పత్తిపంటలో పచ్చదోమ, పేనుబంక, తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. రసం పీల్చే పురుగులైన పేనుబంక తేనె వంటి జిగురు పదార్థాన్ని విసర్జించడం వలన నల్ల మసి తెగులు వ్యాపిస్తుందన్నారు. దీని వలన కిరణజన్య సంయోగక్రియ సక్రమం గా జరగక మొక్కల్లో ఎదుగుదల లోపించి పూత, కాండంపై ప్రభావం చూపుతుందన్నారు. పచ్చదోమ వల్ల తల్లిపురుగుల ఆకు అడుగు భాగంలో చేరి సరం పీల్చడం వలన ఆకులు పసుపు వర్ణంగా మారుతాయన్నారు. దీని వలన పంటకు తీవ్రనష్టం జరుగుతుందన్నారు. రైతులు తప్పకుండా వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో దేవదాసు, రైతులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన చెన్నబసప్ప



ఎస్పీకి బొకే ఇస్తున్న టీడీపీ నాయకుడు చెన్నబసప్ప, కుమారుడు అమోగ్

కౌతాళం, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): కర్నూలు సూపరిటెండెంట్ ఆఫ్ పోలీస్ విక్రాంత్ పాటిల్‌ను బుధవారం తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చెన్నబసప్ప తన కుమారుడు అమోగ్ కలిసి బొకే అందజేశారు. కౌతాళం పోలీస్ స్టేషన్‌కు తాను స్థలాన్ని విరాళంగా అందజేసినట్లు తెలిపారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



విద్యుత్ శాఖ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

పెద్దకడబూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సత్యన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లోని విద్యుత్ శాఖ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదానీతో చీకటి ఒప్పందంతో స్మార్ట్ మీటర్లను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. ఇప్పటికే వాణిజ్య దుకాణాలకు బిగించిన స్మార్ట్ మీటర్లను తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ప్రజలపై విద్యుత్ చార్జీల, స్మార్ట్ మీటర్ల పేర్లతో మరింత భారం పెట్టకుండా తక్షణమే విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి హనుమంతు, నాయకులు పెద్దారెడ్డి, రామాంజినేయులు, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనం నడిపితే జరిమానా తప్పదని రూరల్ సీఐ బీవీ మధుసూదన్‌రావు హెచ్చరించారు. బుధవారం ఎర్రకోట రోడ్డులోని బాటమారెమ్మవ్వ దేవాలయం సమీపంలో వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యంతాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఆటో డ్రైవర్లు అధికలోడ్‌ను వేసుకొని నడపరాదన్నారు. వాహనాల రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి: ఏడీఏ

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజనల్ సాగు చేసుకున్న పంటలను ప్రతి రైతు తప్పని సరిగా డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏవో హైమలత కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాలల్లో వారు పంటను పరిశీలించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ- పంటల యాప్‌లో రైతులు సాగు చేసుకున్న పంటలను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం అందించే అన్ని వ్యవసాయ పథకాలకు అర్హత పొందుతా రన్నారు. రైతులు ఆయా గ్రామాలలోని రైతుల సేవకేంద్రాలను సంప్రదించి డిజిటల్ క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలని కోరారు.

కంటి ఆపరేషన్లు చేయడం అభినందనీయం



మందులు అందజేస్తున్న డీఎస్పీ భార్గవి

ఎమ్మిగనూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరలో ఎన్టీఆర్ వైద్యసేవల కింద 700 మందికి ఉచితంగా ఆర్‌కే వైద్యశాల డాక్టర్ హేమంత్ కుమార్ కంటి ఆపరేషన్లు చేయటం అభినందనీయమని డీఎస్పీ భార్గవి అన్నారు. ఆర్‌కే వైద్యశాలలో కంటి ఆపరేషన్లు చేయించుకున్న 70 మందికి మందు లు డీఎస్పీ భార్గవి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాసులు, రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నటరాజరెడ్డి, కార్యదర్శి సుధా కర్ రావు, డాక్టర్ గణేష్, అనురాధ, రాజేంద్రప్రసాద్, కమలమ్మ పాల్గొ న్నారు.

ఉత్సవాలకు రావాలని

ప్రముఖులకు ఆహ్వానం



తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, సినీదర్శకుడు అనిల్ రావిపూడికి ఆహ్వాన పత్రికలు అందజేస్తున్న శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు రావాలని తెలంగాణ రాష్ట్ర యువజన క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి, తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావులకు శ్రీమఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరిటెండెంట్ అనంతపురాణిక్ ఆహ్వాన పత్రికలను అందజేశారు. బుధవారం హైదరాబాద్ లోని వేర్వేరు స్థలాల్లో కలిసి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఇచ్చిన మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చారు. అనంతరం పీఠాధిపతితో ఫోన్‌లో మాట్లాడించారు. మంత్రాలయంలో జరిగే ఉత్సవాలకు వస్తామని తెలిపారని మఠం అధికారులు చెప్పారు.


పేదల పక్షాన సీపీఐ నిరంతర పోరాటం



పోస్టర్ విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): నిరుపేదల పక్షాన సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని సీపీఐ సీనియర్ నాయకులు మద్దిలేటి నాయుడు, రైతు సంఘం అధ్యక్షుడు కటికేమాలిక్ అన్నారు. బుధవారం గోనెగండ్లలో సీపీఐ నాయకుల సమావేశం నిర్వహించారు. సీపీఐ, రైతుసంఘం, నాయకులు మాట్లాడుతూ సీపీఐ పార్టీ పేదల పక్షాన నిలబడి వారి ఉన్నతికి నిరంతరం పాటు పడుతుందని తెలిపారు. 24వ జిల్లా మహాసభలు ఆగస్టు 9,10,11 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాలను వారు విడుదల చేశారు. సీపీఐ మండల సహా య కార్యదర్శి శ్రీరాములు, పూజారి మునిస్వామి, యూనుష్, బోయ లింగన్న, బేతాళ బాషా, మాల నరసింహులు సమీర్, అన్ను కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వలస కూలీ మృతి



ఉలిగప్ప (ఫైల్)

పెద్దకడబూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లిన ఓ కూలీ విగత జీవిగా మారాడు. విద్యుదాఘాతానికి గురై అక్కడ మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. మండలంలోని జాలవాడి గ్రామానికి చెందిన జంపాపురం ఉలిగప్ప (35) నెల రోజులు క్రితం కుటుంబ సభ్యులతో హైదరా బాద్‌కు వలసవెళ్లాడు. బుధవారం పనిచేసే ప్రదేశంలో బోరు దగ్గర నీటిని తోడేందుకు వెళ్లాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న విద్యుత్ మోటరుకు కాలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించాడు. దీన్ని గమనించిన తోటి కూలీలు బిల్డింగ్ యజమానికి సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బతుకుదెరువు కోసం నగరానికి వెళ్లిన ఉలిగప్ప శవమై ఇంటికి తిరిగి రావడంతో కుటుంబసభ్యులు, బంధువులు రోదించిన తీరు పులువురిని కంటతడి పెట్టించింది. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఉలిగప్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

గోనెగండ్ల, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని ఆల్‌ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సభ్యులు ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం గోనెగండ్లలో సీఐటీయూ నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం గడిచినప్పటికీ ఆటో డ్రైవర్‌కు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదన్నారు. కరుణాకర్, దండుఖాజా, నబిరసూల్, వేణుగోపాల్, నాగేష్, కృష్ణ, ఆది, ధనుంజయ్, బాబు, షరీఫ్, జాఫర్, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.